# మయన్మార్-భారత్ సరిహద్దులో భూకంపం

న్యూఢిల్లీ : మయన్మార్-భారత్ సరిహద్దులో నేడు భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 5.8 గా నమోదైంది. భూకంపం 10 కి.మీ (6.21 మైళ్ళు) లోతులో సంభవించిందని జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ తెలిపింది. అయితే ఆస్తి, ప్రాణ నష్ట వివరాలు మాత్రం ఇంకా వెల్లడించలేదు. భూప్రకంపనలతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఇటీవల పాకిస్థాన్, నేపాల్, ఉత్తర భారత్‌లో కూడా భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ప్రకంపలు చోటుచేసుకున్నాయి. కొన్ని సెకన్ల పాటు కంపించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. అయితే భయంతో జనాలు బయటకు పరుగులు తీశారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :12 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 06-03-2025 పేజీలు:4 వెల: 2.00


## ఇప్పటికైనా కేసీఆర్ గొప్పతనం కాంగ్రెస్‌కు అర్థం కావాలి



హైదరాబాద్,కేసీఆర్ కృషి ఫలితం.. సీతారామా ప్రాజెక్టు, నెర్రెలు బాసిన సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. నాడు సీతారామ ప్రాజెక్టును వ్యతిరేకించిన కాంగ్రెస్.. అప్పట్లో అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేశారని అన్నారు. కానీ నేడు కాంగ్రెస్ మంత్రులు, నాయకులు మాత్రం గోదావరి జలాల వద్ద ఫోటోలకు ఫోజులిస్తున్నారని విమర్శించారు. తిట్టడం తప్ప.. కట్టడం రాని కాంగ్రెస్‌కు, కేసీఆర్ గొప్పతనం ఇప్పటికైనా అర్థం కావాలని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఒక్క ఎకరాకు నీరు రాదు అన్నోళ్ళు, ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి హక్కులను కాపాడలేని కాంగ్రెస్ చేతగానితనం వల్ల సాగర్ ఆయకట్టుకు కరువు వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల రోజుకు పదివేల క్యూసెక్కుల కృష్ణ జలాలను ఆంధ్ర తరలించుకుపోతున్న పరిస్థితి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో రైతులను ఆదుకునేందుకు ఏకైక మార్గం గోదావరి జలాలను ఒడిసి పట్టి, ఎత్తిపోయడమే అని తెలిపారు. దీన్ని ముందే అంచనా వేసిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు.కేంద్రం కొర్రీలను, కాంగ్రెస్ పార్టీ కుట్రలను ఛేదించి వడివడిగా 90 శాతం పనులు పూర్తి చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఇదే కాంగ్రెస్ నేతలు నాడు సీతారామ ప్రాజెక్టే వృథా అన్నారని.. అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేయించారని చెప్పారు. కానీ కేసీఆర్ పట్టుబట్టి న్యాయపరమైన చిక్కులు తొలగించి, అత్యంత క్లిష్టమైన అటవీ పర్యావరణ అనుమతులు సాధించి సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయించారని పేర్కొన్నారు. ఆ ఫలితమే నేడు కరువు కోరల్లో చిక్కుకున్న ఖమ్మం జిల్లా రైతులకు వరంగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించి సిద్ధంగా ఉంచిన సీతారామ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తూ అక్కడ ఫోటోలకు మంత్రులు, నాయకులు ఫోజులు ఇస్తున్నారంటే అందుకు కేసీఆర్ ఏ కారణమని తెలిపారు.ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల సాగు, తాగునీటి కష్టాలకు సీతారామ ఒక శాశ్వత పరిష్కార మార్గం అని హరీశ్‌రావు అన్నారు. ప్రత్యక్షంగా ఆరు లక్షల ఎనబై వేల ఎకరాలకు, పరోక్షంగా పది లక్షల ఎకరాలకు సీతారామ ద్వారా గోదావరి జలాలు అందించామని తెలిపారు. సీతారామ ద్వారా ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదని నాడు ప్రతిపక్షంలో ఉండి ఇదే కాంగ్రెస్ నాయకులు విమర్శించారని గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 7న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిందని.. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు మీద విషం చిమ్మారని పేర్కొన్నారు. వృథా ప్రాజెక్టు అన్నారని.. ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదన్నారని.. డీపీఆర్ లేదని చెప్పారు. ఒకే ఒక్కసారి మంత్రులు బృందం పర్యటించి, 2024 ఆగస్టు15వ తేదీన మూడు పంపు హౌసులను ఏకకాలం స్విచ్ ఆన్ చేసి ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. కేసీఆర్ మొక్కవోని దీక్షముందు కాంగ్రెస్ నేతల ఆరోపణలు పటాపంచలు అయిపోయారని హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కష్టం, నేడు సగౌరవంగా రైతుల ముంగిట నిలబడిందని.. 60 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనకు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు తేడాను సుస్పష్టం చేసిందని చెప్పారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే పది లక్షల ఎకరాలకు నీళ్లించే ప్రాజెక్టును ప్రారంభించారంటే%౹% దాని వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఓట్లు, సీట్లు, అధికారం శాశ్వతం కాదని, మనం చేసిన అభివృద్ధే శాశ్వతమని నమ్మే నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. అలా నమ్మి నిర్మించినవే కాళేశ్వరం, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులు అని స్పష్టం చేశారు. ఈ తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు రైతాంగానికి జీవనాడులై బాసిల్లుతాయని.. కేసీఆర్ కృషి దశదిశలా చాటుతాయని పేర్కొన్నారు.

## బీజేపీకి రేవంత్ పరోక్షంగా సహకరిస్తున్నారు..


హైదరాబాద్: తెలంగాణలో కులగణన తప్పు అని పత్రాలను తగలబెడితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా? అంటూ ప్రశ్నించారు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న. రాహుల్ గాంధీ తల ఎత్తుకునేలా కుల గణన జరగాలని రేవంత్ రెడ్డికి సూచించాను. అందుకే రేవంత్ నన్ను సస్పెండ్ చేయాలని చాలా రోజుల నుంచి అనుకుంటున్నాడు అని చెప్పుకొచ్చారు.ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బుధవారం ఉదయం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ కావాలనే నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. కరీంనగర్ వెళ్లే సమయంలో కూడా నన్ను సస్పెండ్ చేయాలని పీసీసీకి సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ నేతలకు గట్టి మద్దతు లభించింది.. భవిష్యత్‌లో మరింత బలంగా పోరాడుతాం. నన్ను సస్పెండ్ చేయడం ద్వారా బీసీలు ప్రశ్నించరనే భ్రమ నుంచి రేవంత్ రెడ్డి బయటకు రావాలి.కులగణన తప్పు అని పత్రాలను తగలబెడితే సస్పెండ్ చేస్తారా?. రాహుల్ గాంధీ తల ఎత్తుకునేలా కుల గణన జరగాలని రేవంత్ రెడ్డికి సూచించాను. సమగ్ర కుటుంబ సర్వేను కేసీఆర్ పకడ్బందీగా నిర్వహించారు. చివరి రోజు రేవంత్ రెడ్డి కులగణన చేయించుకున్నారు. అగ్ర వర్గాలను ఎక్కువ చూపించారు.. బీసీలను తక్కువ చూపించారు. నేను చెప్పింది తప్పు అయితే.. మళ్ళీ ఎందుకు సర్వే చేశారు. EWS రిజర్వేషన్ల రక్షణ కోసమే బీసీ జనాభా తగ్గించారు. 90 ఏళ్ళ తర్వాత సర్వే చేసినా.. ఒక్కరు కూడా చప్పట్లు కొట్టలేదు. కులగణన తప్పు అని నేను నిరుపిస్తా. తప్పు జరిగితే సరిదిద్దుకోండి.కులగణన చేస్తారనే హామీ ఇచ్చారనే ఒకే ఒక కారణంతో కాంగ్రెస్ పార్టీలో చేరాను. రేవంత్ రెడ్డిపై నమ్మకంతో కాదు.. రాహుల్ గాంధీపై నమ్మకంతో కాంగ్రెస్‌లో చేరాను. సీఎం పేరును మంత్రులు కూడా ఉచ్చరించడం లేదు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఒక న్యాయం.. రాజగోపాల్ రెడ్డికి ఒక న్యాయమా?. అంతర్గత ప్రజాస్వామ్యం అగ్రవర్ణాలకేనా?.. బలహీన వర్గాలకు లేదా?. కేసీఆర్‌పై పోరాటం చేసింది నేనే. నేను పోరాటం చేస్తుంటే.. కాంగ్రెస్




నేతలంతా ఎక్కడ ఉన్నారు?. కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో నా పాత్ర ఉంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేసి ఉంటే ఇంకో 8 సీట్లు వచ్చేవి.బీజేపీకి పరోక్షంగా రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారు. సంవత్సరంలోనే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఎందుకు?. ఆత్మపరిశీలన చేసుకోవాలి. వంశీ చందర్‌రెడ్డిని ఓడగొట్టింది మీరే. పార్టీ నేతలు తన మాట వినడం లేదని రేవంత్ రెడ్డి అలిగి పోతున్నారట. ప్రసన్న హరికృష్ణ కాంగ్రెస్‌ను ఓడిస్తున్నాడు. 2028లో తెలంగాణకు బీసీనే ముఖ్యమంత్రి అవుతాడు. పిల్లి గాండ్రింపులకు భయపడేది లేదు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో అన్ని బీసీ సంఘాలకు ఒకే ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేస్తాం. అందరినీ ఏకం చేస్తాం. వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీలను నిలబెడుతాం. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే ఆలోచన లేదు. మండలిలో మాట్లాడేది చాలా ఉంది. ప్రధాని మోదీ నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. అదే విధంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించాలి అని తెలిపారు.

## ప్రతి మహిళకు చంద్రబాబు రూ.36 వేలు: వైఎస్ జగన్

హైదరాబాద్,ఎన్నికల సమయంలో తప్పుడు వాగ్దానాలు ఇచ్చారు.. కరపత్రాలు కూడా పంచారు. బడ్జెట్ లో ప్రజలకు ఇచ్చింది మాత్రం గుండు సున్నా అంటూ ఇటీవల ఏపీ ప్రభుత్వం బడ్జెట్ పై జగన్ విమర్శలు చేశారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు బడ్జెట్ లలో ప్రజలను మోసం చేశారని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో తప్పుడు వాగ్దానాలు ఇచ్చారు.. కరపత్రాలు కూడా పంచారు. బడ్జెట్ లో ప్రజలకు ఇచ్చింది మాత్రం గుండు సున్నా అంటూ ఇటీవల ఏపీ ప్రభుత్వం బడ్జెట్ పై జగన్ విమర్శలు చేశారు.గవర్నర్ కు ఇచ్చిన పుస్తకం లో కూడా తప్పుడు సమాచారం ఇచ్చారు. సోసియేఎకామిక్ సర్వేలో 2024 నుంచి 2025లో 27లక్షలకు పైనే ఉద్యోగాలు ఇచ్చేశామని చెబుతున్నారని జగన్ విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే సచివాలయం పని చేసేందుకు లక్ష30 వేల మందికి, గ్రామ వాలంటీర్లుగా రెండు లక్షలు, అప్కాస్ ద్వారా 90 వేల పైనే ఉద్యోగాలు ఇచ్చాం. వైసీపీ ఐదేళ్ల హయాంలో 6 లక్షల 30వేల మందికిపైనే ఉద్యోగాలు ఇచ్చామని జగన్ అన్నారు. 2019 నుండి 2024 వరకు ఎమ్ఎస్ఎమ్ సెక్టర్ తోపాటు అన్ని సెక్టర్లు కలుపుకుని 40లక్షల పైనే ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. పారిశ్రామిక వ్యక్తులను కడపలో స్టీల్ ఫ్యాక్టరీ పెట్టకుండా ఉండేందుకు భయపెడుతున్నారని కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు చేశారు. 18సంవత్సరాలు ఉన్న ప్రతి మహిళకు రూ. 18వేలు ఇస్తామని చెప్పారు. ఈ హామీ ఎమైంది బాబు..? సమాధానం చెప్పాలి అంటూ జగన్ ప్రశ్నించారు. ప్రతి మహిళకు చంద్రబాబు 36 వేలు బాకీ ఉన్నారు. ఉచిత బస్సు అన్నారు.. రాష్ట్ర మొత్తం మహిళలు ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు మహిళలకు సమాధానం చెప్పాలి. స్కూల్ కు వెళ్ళే ప్రతి విద్యార్థికి సంవత్సరానికి 15 వేలు





అన్నారు. ఎంత మంది ఉంటే అన్ని 15 వేలు అంటూ ఊరుఊరు ఊదరకొట్టారు. ఇది ఏమైందో చంద్రబాబు విద్యార్థులకు సమాధానం చెప్పాలని జగన్ ప్రశ్నించారు.రైతులను కూడా కూటమి ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎం కిసాన్ కు సంబంధం లేకుండా సంవత్సరానికి 20వేలు ఇస్తామన్నారు.. ఇప్పటి వరకు రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రెండు బడ్జెట్ లలో రైతులకు 40వేలు బాకీ ఉన్నారు. 50 సంవత్సరాలు నిండిన మహిళలకు 45వేలు ఇస్తామని చెప్పారు. రెండు సంవత్సరాలకుగాను కలిపి 50 సంవత్సరాల మహిళలకు 90వేలు బాకీ ఉన్నారు అంటూ కూటమి ప్రభుత్వాన్ని జగన్ నిలదీశారు.ప్రభుత్వం ప్రజల సొమ్ముతో నడుస్తుంది. పక్షపాతం, రాగద్వేషాలకు అతీతంగా పనిచేస్తానని ప్రమాణం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు చేస్తుంది ఏమిటి.? అంటూ జగన్ ప్రశ్నించారు. నా మాటలు న్యాయమూర్తులు కానీ, గవర్నర్ కానీ వింటుంటే అసలు ముఖ్యమంత్రి పదవి నుంచి చంద్రబాబును తొలగించాలి అంటూ జగన్ వ్యాఖ్యానించారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరు ఖరారు!




విజయవాడ:శాసన సభ్యుల కోటాలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా కొణిదెల నాగబాబు పేరును పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు.ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నాగబాబుకి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమాచారం ఇచ్చారు. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని పార్టీ కార్యాలయాన్ని పవన్ ఆదేశించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగబాబు సేవలందిస్తున్నారు.ఇటీవల ఏపీలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు టీడీపీ, ఒకటి బీజేపీ తీసుకునే అవకాశం ఉంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కోరిక మేరకు ముందుగా నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోవాలని సీఎం భావించారు. కానీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానంకు ఎంపిక చేశారు. దాంతో నాగబాబుకు రాజ్యసభ అంటూ వస్తున్న ప్రచారానికి జనసేన తెరదించింది. నాగబాబుకు సినిమాటోగ్రఫీ మంత్రి పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నిక నామినేషన్లకు మార్చి 10 చివరి గడువు. ప్రభుత్వ సెలవు రోజులు మినహాయించి.. మిగిలిన ఏ రోజైనా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ శాసనసభ భవనంలో నామినేషన్లను అధికారులు స్వీకరిస్తారు. మార్చి 11న ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన, మార్చి 13న మధ్యాహ్నం 3 గంటల్లోపు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.

## తమిళంపై ప్రేముంటే.. కేంద్ర కార్యాలయాల్లో హిందీ తొలగించండి

తమిళనాడు: తమిళంపై కేంద్రానికి ప్రేముంటే.. తమిళనాడులోని కేంద్ర కార్యాలయాల్లో హిందీ తొలగించాలని ముఖ్యమంత్రి ఎంకే.స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ ట్విట్టర్‌లో డిమాండ్ చేశారు.డీలిమిటేషన్‌పై స్టాలిన్.. బుధవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయా రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ భేటీలో కమల్‌హాసన్ కూడా పాల్గొన్నారు. అంతకముందు స్టాలిన్.. హిందీపై కీలక పోస్ట్ చేశారు.ప్రధాని మోడీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని బీజేపీ చెబుతోందని.. అదే నిజమైతే చేతల్లో ఎందుకు చూపించడం లేదని స్టాలిన్ ప్రశ్నించారు. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటు చేయడం కంటే.. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుందన్నారు. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి.. మరిన్ని నిధులు కేటాయించాలని స్టాలిన్ కోరారు.ఇక లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన ప్రక్రియ చేపట్టాలని కేంద్రాన్ని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం.. పార్లమెంటులో తాము 12 సీట్లు కోల్పోయి.. 10 సీట్లు మాత్రమే



వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన ప్రక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.

## రెచ్చిపోతున్న సైబర్‌నేరగాళ్లు..ఎమ్మెల్యే వేముల వీరేశంకు న్యూడ్ వీడియో కాల్





హైదరాబాద్,మార్చి5:రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంను టార్గెట్ చేసి న్యూడ్ కాల్స్‌తో బెదిరింపులకు దిగారు. న్యూడ్ వీడియో కాల్‌ను రికార్డు చేసి ఆయన మొబైల్‌కు పంపించడమే కాకుండా.. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివరాల ప్రకారం.. నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు నిన్న రాత్రి సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేశారు. ఆ కాల్ లిఫ్ట్ చేయగానే అవతలి అమ్మాయి నగ్నంగా కనిపించింది. మొబైల్ స్క్రీన్‌పై ఆ సీన్ చూడగానే వేముల వీరేశం ఫోన్ కట్ చేశాడు. కానీ అదంతా స్క్రీన్ రికార్డు చేసిన సైబర్ నేరగాళ్లు.. ఆ వీడియోను ఆయనకే పంపించారు. తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆ వీడియోను కుటుంబసభ్యులు, మిత్రులకు పంపించడమే కాకుండా సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కానీ ఆయన స్పందించకపోవడంతో ఆ వీడియోను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు పంపించారు. ఆ వీడియో చూసిన వెంటనే సదరు నేతలు, కార్యకర్తలు వేముల వీరేశానికి ఫోన్ చేసి ఆరా తీశారు. దీంతో కంగుతిన్న ఎమ్మెల్యే.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. పోలీసుల సలహాలతో సైబర్ నేరగాళ్ల నంబర్‌ను బ్లాక్ చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు.

### ఫలించిన హరీశ్‌రావు ప్రయత్నం

సిద్దిపేట,సిద్దిపేట నియోజకవర్గ రైతుల పక్షాన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ప్రయత్నం ఫలించింది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ మీదుగా రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి తక్షణమే నీటిని ఎత్తిపోయాలని హరీశ్ రావు ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖకు స్పందన లేకపోవడంతో ఫోన్ చేసి మాట్లాడారు. రైతుల కష్టాల గురించి క్షుణ్ణంగా చర్చించారు. వెంటనే నీరు ఎత్తిపోయకుంటే 50 వేల ఎకరాల్లో పంట ఎండిపోతుందని.. రైతులంతా తీవ్రస్థాయిలో నష్టపోతారని.. క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యాసంగి పంట చేతికొచ్చేదాకా సాగునీటిని అందుబాటులో ఉంచాలని.. గడిచిన నాలుగేళ్ల పాటు సాగునీరు అందించిన తీరును వివరించారు. కనీసం 1టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని కోరారు.

## ఒక ఎమ్మెల్సీ సీటు ఇవ్వండి .. రేవంత్ ను కోరిన సిపిఐ బృందం



హైదరాబాద్ : ఎమ్మెల్సీ ఎన్నికలలో ఒక సీటు తమ పార్టీకి కేటాయించవలసిందిగా సిపిఐ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరింది.. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇప్పుడు ఎమ్మెల్సీ సీటు ఇవ్వాల్సిందేనని ఆ పార్టీ ఎమ్మెల్యే, రాష్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.. సిపిఐ బృందం నేడు రేవంత్ ను ఆయన నివాసం లోకి ఎమ్మెల్సీ ఎన్నికలపై తమ అభిప్రాయాలను తెలిపింది. అనంతరం కూనంనేని మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికలలో స్థానిక పరిస్థితుల ప్రభావం ఉంటుంది తప్పితే.. ఆయా పార్టీలు అలాగే కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ప్రతిబింబించవు అని అన్నారు. అలాగే, కాంగ్రెస్- సీపీఐ పార్టీల మధ్య 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన ఒప్పందం ప్రకారంగా తమ పార్టీకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరడం జరిగింది అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు దొమ్మాట సాంబయ్యకు ఇవ్వాలని కోరామని,.. దానికి సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీతో మాట్లాడి నిర్ణయం చెబుతాను అన్నారని కూనంనేని సాంబశివ రావు వెల్లడించారు.కాగా, రేవంత్ తో జరిగిన సమావేశంలో కూనంనేని తో పాటు , సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఈటీ నరసింహ పాల్గొన్నారు

అగ్రనేత



సంపాదకీయం

గురువారం 06-03-2025

# ప్రజలకు నిరాశ

టిడిపి కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ ప్రజల ఆశలు ఆకాంక్షలపై నీళ్లుచల్లింది. అభివృద్ధి, సంక్షేమం తమకు రెండు కళ్లని సర్కారు పేర్కొనగా బడ్జెట్ కేటాయింపులు అందుకు తగ్గట్టు లేవు. రాష్ట్ర చరిత్రలో రూ. 3.22 లక్షల కోట్ల బాహుబలి బడ్జెట్ అని ఆకాశమే హద్దుగా ప్రచారం చేసినా సూపర్ సిక్స్, పోలవరం, అమరావతి సహా ముఖ్యమైన పథకాలు, కార్యక్రమాలన్నీ విదిలింపులు, విస్మరణకు లోనయ్యాయి. కార్పొరేట్ సంస్కరణలకు మాత్రం పెద్దపీట వేశారు. కూటమి వచ్చింది లగాయతు 'స్వర్ణాంధ్ర విజన్-2047' ను భుజానికెత్తుకుంది. మోడీ ప్రభుత్వ వికసిత భారత్‌కు ఇది నకలు. బిజెపి ప్రవచించే 'వికాసం' అదానీ, అంబానీలకేనన్నది బహిరంగ రహస్యం. అదే బాటన నడుస్తామని కంకణం కట్టుకున్న చంద్రబాబు ప్రభుత్వంలో లాభపడేది కార్పొరేట్లేనని బడ్జెట్‌ను చూస్తే అర్థమవుతుంది. 'విజన్' సాధనకు ఎంచుకున్న పి-4 తో సహా విధానాలన్నీ ప్రైవేటు, కార్పొరేట్ల మేలు కోసమేనని పంటల ధరల స్థిరీకరణ నిధి రూ. 300 కోట్లు మాత్రమే కేటాయించి, వయబిలిటీ గ్యాప్ ఫండ్‌కు బడ్జెట్‌లో ప్రభుత్వం 2 వేల కోట్లు ప్రతిపాదించడంతోనే తెలిసిపోతుంది.బడ్జెట్‌లో ప్రభుత్వం వేసిన ఆదాయ, వ్యయాల అంచనాలు గాలిలో మేడలు కడుతున్నాయి. 2023-24లో వాస్తవ వ్యయం 2.53 లక్షల కోట్లు. 2024-25లో 2.94 లక్షల కోట్ల బడ్జెట్ వేసి 2.74 లక్షల కోట్లకు సవరించారు. సుమారు 20 వేల కోట్లకు ఖర్చు కుదించారు. ఇప్పుడేమో ఏకంగా 3.22 లక్షల కోట్లుగా చూపించారు. గత కొన్నేళ్లల్లో ప్రతిపాదించిన మేరకు ఏనాడూ పూర్తిగా ఖర్చు చేసిన ఉదంతాల్లేవు. అలాంటప్పుడు భారీ అంకెలు కాగితాలకే. వచ్చే ఆదాయంపై వేసిన అంచనాలూ నేల విడిచి సాము చేసినట్టున్నాయి. నిరుడు వచ్చిన మొత్తం ఆదాయం 2.53 లక్షల కోట్లు కాగా ప్రస్తుత ఏడాది 2.94 లక్షల కోట్లు వస్తాయని తొలుత ఎస్టిమేట్ చేసి 2.74 లక్షల కోట్లకు సవరించారు. వచ్చే సంవత్సరం 3.22 లక్షల కోట్లు లభిస్తాయంటున్నారు. పెంచిన 48 వేల కోట్లూ ఎక్కడి నుంచి తెస్తారు? పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయం భారీగా పెంచారు. ఆ విధంగా ఆదాయం పెరగాలంటే ప్రజలపై పన్నులు బాదాలి, ప్రభుత్వ ఆస్తులు అమ్మాలి. ఎక్సయిజ్ ఆదాయం 21 నుంచి 27 వేల కోట్లకు పెంచుతామన్నారు. అంటే, ప్రజలకు తాగబోయించి ఆదాయం సమకూర్చుకుంటారన్నమాట. సేల్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ఎంవి ట్యాక్సులతో జనం వీపు విమానం మోత మోగుతుందని చెప్పకనే చెప్పారు. అప్పులు లక్ష కోట్ల వరకు ఉన్నాయి. ఇంతా చేసినా రెవెన్యూ లోటు 33 వేల కోట్లు, ద్రవ్యలోటు 79 వేల కోట్లన్నారు. చివరాఖరుకు పెరగడం ఖాయమని గత అనుభవాన్ని బట్టి తెలుస్తుంది. ఆదాయం తగ్గితే సంక్షేమానికి కోతలు పడటం ఖాయం.కూటమి హామీలలో ప్రధానమైనవి సూపర్ సిక్స్ పథకాలు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు తొలేడాది సగానికి కత్తెరేశారు. వచ్చే ఏట కేటాయింపులు సరిపోను లేవు. అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం మొదటి సంవత్సరం ఎగ్గొట్టారు. వచ్చే ఏడాదికి అత్తెసరు నిధులు ప్రతిపాదించారు. మహిళలకు నెలకు 1,500, బస్సుల్లో ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి బడ్జెట్‌లో కనిపించలేదు. తొలి సంతకం చేసిన మెగా డిఎస్‌సిపై అయోమయమే. సూపర్ సిక్స్‌లో మూడు పథకాలను దాటవేస్తే, మేనిఫెస్టోలోని మిగిలిన వందకుపైగా హామీల పరిస్థితేంటోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ బడ్జెట్ 48 వేల కోట్లనగా, దానిలో ఉచిత విద్యుత్, ఉపాధి హామీ, ఇరిగేషన్ పద్దులు 32 వేల కోట్లు. ఇదీ 60 శాతం జనాభా ఆధారపడ్డ ప్రాథమిక రంగానికి ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యత. కౌలు రైతులకు కొత్త చట్టం తెస్తామన్నారు తప్ప ఎప్పుడో క్లారిటీ ఇవ్వలేదు. సాగునీటి ప్రాజెక్టులకు పోలవరంతో సహా చూపించింది 18 వేల కోట్లు. కేంద్రం కట్టాల్సిన పోలవరానికి 6 వేల కోట్లన్నారు. కేంద్రం 12 వేల కోట్లిస్తామన్నారని సగమే ఎందుకు చూపారో తెలీదు. నిర్వాసితుల గురించి మాట్లాడలేదు. అమరావతిలో వేలాది కోట్ల పనులకు టెండర్లు పిలవగా బడ్జెట్‌లో 6 వేల కోట్లే చూపించారు. విద్య, వైద్యం, ఉపాధి అన్నింటికీ అత్తెసరు నిధులే. మూలధన వ్యయమూ అంతంతే. కేంద్రాన్ని నిధులడగకుండా, ప్రత్యేక హోదా లేకుండా రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం, ఉద్యోగ ఉపాధిపై భారీ టార్గెట్లు చేరుకోవడం సాధ్యమా?


# త్రిభాషా సూత్రం.. దక్షిణాదికే ఎందుకు, ఉత్తరాదికి లేదే!

తమిళనాడు: నిస్సందేహంగా హిందీని దక్షిణాది రాష్ట్రాలపై రుద్దుతున్నారు. ఒకవైపు ఉత్తరాది రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు విపరీతమైన వలసలు. మరోవైపు త్రిభాషా సూత్రాన్ని దక్షిణాది రాష్ట్రాలే పాటించాలి, ఉత్తరాది రాష్ట్రాలకు ఆ అవసరం లేదన్నట్టుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు! ఇలాంటి నేపథ్యంలో తెలుగు వారు కిమ్మనడం లేదు కానీ, పొరుగు రాష్ట్రాల వారు మాత్రం గయ్యి మంటున్నారు. హిందీ వ్యతిరేక ఉద్యమానికి పుట్టినిల్లుగా తమిళనాడు తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఉంది. ఇప్పుడు కర్ణాటక కూడా స్వరం కలిపింది. బెంగళూరులో హిందీలో మాట్లాడకపోతే దోషం అయినట్టుగా కొందరు నార్తిండియన్లు ఇచ్చే కటింగులు, నార్తిండియన్లు బెంగళూరు రావడం వల్లనే బెంగళూరు మహానగరం అయినట్టుగా వారు స్పందించే తీరు నేపథ్యంలో కన్నడీగులు కస్సు మంటున్నారు. వాస్తవానికి కర్ణాటక లో కన్నడ తప్పనిసరి అనే పరిస్థితి గతంలో లేదు. అయితే.. హిందీ డ్యామినేషన్ తీవ్రం అవుతుండటం వల్ల అపార్ట్ మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో కూడా హిందీ జనాలు తమది జాతీయ భాష అన్నట్టుగా ఒక అబద్దాన్ని పదే పదే రుద్ధడం వల్ల కన్నడీగుల్లో వ్యతిరేకత మొదలైంది. ఐటీ ఉద్యోగాల కోసం వలస వచ్చిన ఉత్తరాది జనాలు కూడా హిందీని అధికారిక భాష అన్నట్టుగా మీటింగుల్లో కూడా వాడేస్తూ ఉంటారు. అది మినిమం మ్యానర్స్ కూడా కాకపోయినా.. ఐటీ కంపెనీలు నడిచేది ఇంగ్లిష్ వ్యవహారికంగా అయినా, హిందీని చొప్పించడానికి శతాథా ప్రయత్నిస్తున్నారు నార్తిండియన్లు. ఈ నేపథ్యంలో కర్ణాటకలో గత కొన్నాళ్లుగా నార్తిండియన్లు ప్రత్యేకంగా టార్గెట్ అవుతూ ఉన్నారు. ఆటో డ్రైవర్లు వీరిపై మొదట తిరగబడుతున్నారు! వీరి వల్ల కన్నడ రాజ్యోత్సవాన్ని విపరీతంగా సెలబ్రేట్ చేసుకోవడం తీవ్రంగా మారింది. బెంగళూరు కన్నడ నేల అని వారు గుర్తు చేయడానికి ప్రాధాన్యతను ఇస్తూ ఉన్నారు. హిందీ వాళ్లు అతి చేయకపోతే ఇలాంటి పరిస్థితి కర్ణాటకలో వచ్చేది కాదు. అయితే హిందీ అత్యుత్సాహం వల్ల పరిస్థితి ఇక్కడ వరకూ వచ్చింది.కర్ణాటకలో బీజేపీ ఉనికి కూడా హిందీకి అక్కడ ఊతం ఇస్తూ ఉంది. ఒకవేళ తమిళనాడు లాగా బీజేపీ ఉనికి కర్ణాటకలో కూడా కొనకొనగా ఉండి ఉంటే, ఈ స్థాయిలో హిందీ రుద్దుడు అక్కడ ఉండేది కాదు. ఈ అవకాశాన్ని కాంగ్రెస్ కూడా అక్కడ ఉపయోగించుకుంటూ ఉంది. కర్ణాటకలో కన్నడలోనే మాట్లాడాలని, వేరే భాషలను అర్థం చేసుకోవాల్సిన అవసరం తమకు లేదని సీఎం సిద్ధరామయ్య సూటిగా చెబుతూ ఉన్నాడు. హిందీ వ్యతిరేకతను రాజకీయంగా కూడా కాంగ్రెస్ వాడుకుంటూ ఉంది కర్ణాటకలో! కన్నడీగులు కూడా భాషా ప్రేమికులే. ఈ వ్యవహారంలో కర్ణాటకలో ఎలా స్పందించాలో దిక్కుతోచని స్థితిలో ఉంది బీజేపీ. హిందీని జాతీయ భాష అంటూ రుద్దితే స్థానికుల్లో వ్యతిరేకత వస్తుంది. దీంతో.. కర్ణాటక వరకూ హిందీ విషయంలో వ్యూహాత్మక మౌనం పాటిస్తూ ఉంది. తమిళనాడులో మాత్రం మళ్లీ హిందీ విషయంలో బీజేపీ వాళ్లంతా స్పందించేస్తారు! త్రిభాషా సూత్రం అంటారు!అయితే త్రిభాష సూత్రం మూలం ఏమిటి? అదెందుకు పెట్టారు? దాన్ని ఎలా పాటిస్తున్నారో సమీక్ష చేసే ధైర్యం కేంద్రానికి ఉందా? దేశ స్వతంత్రం తర్వాత త్రిభాష సూత్రం అమల్లో పెట్టినప్పుడు%ా% దక్షిణాది రాష్ట్రాలు ఎలా అయితే హిందీని బోధిస్తాయో, అలాగే ఉత్తరాది రాష్ట్రాలు కూడా ఒక దక్షిణాది భాషను తమ రాష్ట్రంలో విద్యార్థులకు బోధించాలి. యూపీలో అయినా, బిహార్ లో అయినా, మధ్యప్రదేశ్ లో అయినా ప్రథమ భాషగా హిందీని , ద్వితీయ భాషగా ఇంగ్లిష్ ను బోధిస్తూ ఉంటే.. తృతీయ భాషగా తెలుగునో, తమిళన్నో, మలయాళాన్నో లేదా.. ఏ పంజాబీనో అయినా ఒక సబ్జెక్ట్ గా బోధించాలి. ఇదీ త్రిభాషా సిద్ధాంతం! ప్రతి రాష్ట్రంలోనూ దాని మాతృభాషతో సహా ఇంగ్లిష్ తో పాటు మరో భారతీయ భాషను బోధించాలి. ఈ మేరకు దక్షిణాదిలో హిందీ ప్రవేశించింది. విచారకరం ఏమిటంటే.. ఈ త్రిభాషా సూత్రం దక్షిణాది రాష్ట్రాల మీదే రుద్దబడింది.తెలుగునాట దశాబ్దాల నుంచి హిందీని మూడో భాషగా బోధిస్తూ ఉన్నారు. అలాగే కర్ణాటకలో కూడా హిందీని ప్రయోగించారు. అయితే తమిళనాడు మాత్రం దీనికి వ్యతిరేకంగా నిలబడింది. దానికి కారణం కూడా ఉత్తరాది రాష్ట్రాలే. త్రిభాషా సూత్రాన్ని కేంద్రం ప్రవచించిన తర్వాత ఏ ఉత్తరాది రాష్ట్రం కూడా మూడో భాషను బోధించలేదు. హిందీ, ఇంగ్లిష్ లకే పరిమితం అయ్యారు. మరే భారతీయ భాషనూ ఉత్తరాది రాష్ట్రాల్లో బోధించనే లేదు ఇప్పటి వరకు! అయితే సౌత్ స్టేట్స్ పై మాత్రం హిందీని దశాబ్దాల కిందటే విజయవంతంగా రుద్దేశారు! దానికి తోడు.. హిందీ బెల్ట్ లో కుటుంబ నియంత్రణ లేకుండా జనాభాను ఇష్టానుసారం పెంచేశారు. దీంతో మత వ్యత్యాసాలు ఏమీ లేవు! పోటాపోటీలు పెట్టుకుని జనాభాను పెంచడమే పనిగా పెట్టుకున్నారు. ఇలా తాము మంది ఎక్కువయ్యాం కాబట్టి.. హిందీని జాతీయ భాష అనే వాదనకు దిగుతున్నారు. తప్పనిసరిగా మీరంతా హిందీ నేర్చుకుని మాతో మాట్లాడండి అన్నట్లుగా సిటీల్లో వీరి తీరు తయారైంది.అసలు హిందీ జాతీయ భాష కాదు. ఇది రాజ్యాంగమే చెబుతూ ఉంది. దేశంలోని సవాలక్ష భాషల్లో




హిందీ ఒకటి అంతే. మంది ఎక్కువయ్యారు కాబట్టి.. అదే జాతీయ భాష అంటే ఎలా చెల్లుతుంది? త్రిభాషా సూత్రాన్ని అమలు చేయకపోతే తమిళనాడుకు నిధులు ఇవ్వమని, ఇవ్వొద్దని అంటూ కూడా బీజేపీ సానుభూతి పరులు రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతూ ఉన్నారు! అయితే ఎవరి నిధులు ఎవరికి ఇస్తున్నారు అనేది కూడా ప్రశ్నే!దక్షిణాది రాష్ట్రాల నుంచి వసూలవుతున్న పన్నులకూ, కేంద్రం నుంచి సౌత్ స్టేట్స్ కూ వస్తున్న నిధులకు పొంతన ఉందా? తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ, ఏపీ ల నుంచి ట్యాక్సుల రూపంలో ఒక రూపాయి కేంద్రానికి వెళుతుంటే, ఈ రాష్ట్రాలకు సగటున 40 పైసలు కూడా తిరిగి రావడం లేదు! తమ సంపాదన నుంచి 60 శాతాన్ని త్యాగం చేస్తూ దేశ ప్రగతికి ఇంధనంగా మండుతున్నాయి దక్షిణాది రాష్ట్రాలు. జనాభా ఎక్కువ చేసి పెట్టిన పుణ్యానికి ఉత్తరాది రాష్ట్రాలను సౌత్ రాష్ట్రాలు పోషిస్తూ ఉన్నాయి! ఇవన్నీ కాకుండా ఇప్పుడు.. తమది దేశ్ భాషా అని, జాత్ కీ భాషా అంటూ హిందీ జనాలు నోరేసుకుంటూ ఉండటం, త్రిభాషా సూత్రం అంటూ కేంద్రం సన్నాయి నొక్కులు నొక్కుతూ ఉండటం విచారకరం! మరి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయమని ఉత్తరాది రాష్ట్రాలను ఎందుకు అడగదో కేంద్ర ప్రభుత్వం. అదేమంటే భాషా చిచ్చు పెట్టువద్దంటూ హిత వచనాలు! ఎవరు చిచ్చు పెడుతున్నది!ఇక ఇదే అనుకుంటే.. అసలు సంగతి లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన! అది జనాభా ప్రాతిపదికన గనుక జరిగితే.. దక్షిణాది రాష్ట్రాలది అరణ్య రోదనే అవుతుంది శాశ్వతంగా! యూపీ, బిహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు జనాభాను పెంచి కూర్చున్నాయి. సౌత్ స్టేట్స్ ఏమో చాలా కాలంగా కుటుంబ నియంత్రణను జాగ్రత్తగా పాటిస్తూ వస్తున్నాయి. ఇందుకు ఫలితం.. మళ్లీ దక్షిణాది రాష్ట్రాలకే శరాఘాతంగా తగలబోతోంది! యూపీ, బిహార్ తో సహా ఉత్తరాది రాష్ట్రాలన్నింటిలోనూ ఎంపీ సీట్లు జనాభా ప్రాతిపదికన పెంచితే భారీగా పెరగబోతున్నాయి! అదే సౌత్ లో అయితే.. పెంపుదల సంగతిని పక్కన పెడితే ఉన్న ఎంపీ సీట్ల సంఖ్య కూడా తగ్గిపోతుంది.కేరళలో అయితే ఎంపీ సీట్ల సంఖ్య తగ్గిపోతుందట! ఏపీ-తెలంగాణలో తూతూ మంత్రంగా ఒకటీ అర పెరుగుతాయి! తమిళనాడులో ఒక ఎంపీ సీటు కూడా తగ్గదంటూ కేంద్ర మంత్రి వర్యులు చెబుతున్నారు కానీ, ఇదే సమయంలో అక్కడ ఒక్క ఎంపీ సీటు అయినా పెరుగుతుందంటూ చెప్పడం లేదు! 20 కోట్ల స్థాయి జనాభాతో యూపీ, బిహార్, అవే కాకుండా మధ్యప్రదేశ్, వెస్ట్ బెంగాల్, ఆఖరికి ఛత్తీస్ ఘడ్, జార?ండ్, ఒడిశాలు కూడా తమ జనాభా పెంపుదలతో ఎంపీ సీట్లను పెంచుకుని దేశ రాజకీయాన్ని శాసిస్తాయి! అయితే క్రమశిక్షణతో కుటుంబ నియంత్రణ పాటించినందుకు గానూ దక్షిణాది రాష్ట్రాలు మూకుమ్మడిగా తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయి. కేంద్రంలో అధికారాన్ని సంపాదించుకోవాలంటే ఉత్తరాదిన పని చేసుకుంటే చాలు. ఉత్తరాదిన ఎంపీ సీట్లతోనే కేంద్రంలో అధికారాన్ని సొంతం చేసుకునే పరిస్థితులు వస్తాయి జనాభా ప్రాతిపదికన ఎంపీ సీట్లు పెరిగితే! అప్పుడు దక్షిణాదిన ఎలా వ్యవహరించినా, దక్షిణాది రాష్ట్రాలను ఎంతగా నిర్లక్ష్యం చేసినా కేంద్రంలో అధికారంలో ఉన్న వారికి నష్టం లేదు! సౌత్ స్టేట్స్ నుంచి పన్నులు వసూలు చేసి ఉత్తరాదికి కేటాయింపులు చేసుకుంటూ, వచ్చే పెట్టుబడులను గుజరాత్ కు తరలించుకుపోవడమే పాలన అవుతుంది!అయితే జనాభా ప్రతిపాదికన ఎంపీ సీట్లను పెంపు ప్రతిపాదనను అపే ధైర్యం కానీ, అందుకు చొరవ చూపే స్థైర్యం కానీ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల నేతలకు ఉందా అనేది ప్రశ్నార్థకమే! తమిళనాడు మాత్రమే ఈ విషయంలో స్పందిస్తూ ఉంది ఇప్పటి వరకూ! దీని వల్ల నష్టం కూడా సదరు రాజకీయ నేతలకే! ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తమ బలం మీద ఆధారపడి ఉన్నప్పుడు కూడా స్పందించకపోతే.. భవిష్యత్తులో వారికి కూడా ఇలాంటి అవకాశాలు రావు! స్థూలంగా జనాభా ప్రాతిపదికన ఎంపీ సీట్ల సంఖ్య పెంపు అంటే మాత్రం.. దేశ రాజకీయంలో సౌతిండియా మొత్తమే ఊకలో ఈక అవుతుంది. మళ్లీ తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ అంటూ ఒక్కో రాష్ట్రం పరిస్థితి అయితే చెప్పుకోనక్కర్లేదు! ఎవరు నెగ్గినా, ఎవరు ఓడినా.. వీళ్లు ఏ లెక్కలోకీ అవసరమే పడరు! అంత స్థాయిలో రాజకీయ ప్రాధాన్యతను కోల్పోతారు!

# ట్రంప్ గోల్డ్ కార్డ్ వీసాను తిరస్కరించిన బిలియనీర్లు.. కారణమిదే



వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన $5 మిలియన్ 'గోల్డ్ కార్డ్' వీసా పథకానికి పెద్దగా ఆదరణ లభించడం లేదు. దీంతో ఈ పథకం విఫలమైందని అర్థమవుతోంది.. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ వ్యాపారవేత్తలు ఈ పథకంపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. ఫోర్బ్స్ నిర్వహించిన తాజా సర్వే ప్రకారం, 18 మంది బిలియనీర్‌లలో దాదాపు మూడొంతులు ఈ పథకంలో పాల్గొనడం గురించి ఆలోచించలేదని పేర్కొన్నారు.

– గోల్డ్ కార్డ్ వీసా లక్ష్యం ఏమిటి?

ట్రంప్ ప్రభుత్వ పరిపాలనలో ప్రవేశపెట్టిన ఈ ప్రత్యేక వీసా పథకం ద్వారా విదేశీ బిలియనీర్‌లు అమెరికాలో ప్రాపర్టీ కొనుగోలు చేయడం, వ్యాపారాలను ప్రారంభించడం, దేశీయ పెట్టుబడులు పెంచడం అనే లక్ష్యంతో ముందుకు తీసుకువచ్చారు. కానీ ఈ పథకం బిలియనీర్ల నుంచి ఆశించిన విధంగా స్పందనను పొందలేకపోయింది.

– బిలియనీర్లు ఎందుకు ఆసక్తి చూపడం లేదు?

ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, ఈ పథకంపై బిలియనీర్‌ల ఆసక్తి తక్కువగా ఉండడానికి కొన్ని ముఖ్యమైన కారణాలు ఉన్నాయి. ఫోర్బ్స్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం, 18 మంది బిలియనీర్‌లలో దాదాపు మూడొంతులు ఈ పథకంలో ఆసక్తి లేదని తెలిపారు. "ధనికులు ఈ వీసాను ఎందుకు ఉపయోగించుకోవాలి అనేది అర్థం కావడం లేదు" అని ఒక రష్యన్ బిలియనీర్ అన్నారు. మరొకరు "ఇప్పుడు వ్యాపార ఆలోచనలను చాలా తక్కువ ఖర్చుతో అమలు చేయాలని చూస్తున్నాం. దీని కోసం %వి%5 మిలియన్ ఖర్చు చేయాలనే అవసరం వస్తుందా?" అని వ్యాఖ్యానించారు. భారతదేశంలోని రెండో అతిపెద్ద హాస్పిటల్ చెయిన్ చైర్మన్ అయిన అభయ్ సోయి ఈ పథకాన్ని పూర్తిగా తిరస్కరించారు. "ఈ శతాబ్దంలో భారతదేశం తప్ప మరే దేశపు పౌరుడిగా నేను ఉండదలచుకోను అని ఆయన స్పష్టం చేశారు.

–వీసా తీసుకోకపోవడానికి ప్రధాన కారణాలు ఇవీ

అమెరికా వలస విధానాల అనిశ్చితి : ట్రంప్ పాలనలో వలస విధానాలు తరచుగా మారిపోతుంటాయి. దీనివల్ల పెట్టుబడిదారులు అమెరికాలో స్థిరపడటంపై సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.వీరికి ఇప్పటికే ప్రీమియం వీసా మార్గాలు అందుబాటులో ఉండటం : చాలా మంది బిలియనీర్‌లు ఇప్పటికే ఇతర ప్రత్యేక వీసా పథకాల ద్వారా అమెరికాలో బస చేసేందుకు వీలుగా మార్గాలను ఏర్పరుచుకున్నారు.పన్నుల భారం : అమెరికాలో పెట్టుబడులు పెడితే అధిక పన్నులు విధించే అవకాశం ఉండటంతో కొందరు దీని వైపు ఆసక్తిని కోల్పోయారు.వేరే దేశాల్లో మెరుగైన అవకాశాలు : కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాలు సులభమైన పెట్టుబడి వీసా విధానాలను అమలు చేయడంతో బిలియనీర్‌లు వాటిని ఎంపిక చేసుకుంటున్నారు.

– గోల్డ్ కార్డ్ వీసా పథకం భవిష్యత్తు?

ఈ పథకం ప్రస్తుత పరిస్థితుల్లో విజయవంతం కావడానికి అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. అమెరికా వీసా విధానాలు మరింత సౌలభ్యంగా మారితే.. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధంగా ప్రణాళికలు రూపొందిస్తే మాత్రమే ఇది విజయవంతం కావచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే, కొత్తగా రాబోయే అధ్యక్షుల పరిపాలన ఏ విధంగా వీసా విధానాలను మార్చుతుందో కూడా కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో అమెరికా పెట్టుబడిదారులకు మరింత అనుకూలమైన అవకాశాలను సృష్టించగలిగితే మాత్రమే బిలియనీర్‌లు 'గోల్డ్ కార్డ్' వీసాకు ఆసక్తి కనబరచే అవకాశముంది.

# అంబులెన్స్‌ను తనిఖీ చేసిన పోలీసులు

హైదరాబాద్,అంబులెన్స్ సైరన్ వినిపిస్తే.. ఎవరైనా సరే సైడ్ ఇస్తారు. ఎందుకంటే అందులోని బాధితుడు.. త్వరగా ఆస్పత్రికి వెళ్తే.. ప్రాణం నిలబడుతుందేమో ఆశ. అయితే అంబులెన్స్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు కొందరు. అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడే అంబులెన్స్‌లను కొందరు తప్పుగా ఉపయోగిస్తున్నారు. వాటిని నడిపిస్తున్న డ్రైవర్లు, నిర్వాహకులు అంబులెన్స్‌ల ముసుగులో దందాలు చేస్తున్నారు. లోపల ఎవరు రోగులు లేకున్నా.. సైరన్ వేసుకుని ట్రాఫిక్ నిబంధనలను దుర్వినియోగం చేస్తున్నారు. దీంతో అంబులెన్స్‌లపై పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. దీంతో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. సైరన్ వేసుకొని కుక్కల్ని తీసుకెళ్తున్న అంబులెన్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. హిమాయత్ నగర్ నుంచి మదినగూడ వైపు వెళ్తుండగా పంజాగుట్ట దగ్గర ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. పంజాగుట్ట ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. అంబులెన్స్ పేరుతో.. లోపల ఎలాంటి రోగులు లేకున్నా.. సైరన్ వేసుకుని ఎంచక్కా వెళ్లిపోతున్నట్లు పోలీసులు గుర్తించారు. అంబులెన్స్ వాహనాలకు ట్రాఫిక్ నిబంధనల నుంచి మినహాయింపు కల్పించటంతో.. దాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. గతంలో మిర్చి బజ్జి తినేందుకు అంబులెన్స్ డ్రైవర్ సైరన్ వేసుకొని వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు కుక్కలను తీసుకెళ్తున్న అంబులెన్స్‌ను పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు.

# వరకట్నం వేధింపులకు నవవధువు బలి

హైదరాబాద్,రాయదుర్గంలో అదనపు కట్నం వేధింపులకు బలైపోయింది నవవధువు. భర్త, అత్తింటి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది దేవిక. ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవంతంగా ప్రాణం తీసుకుంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. కానీ, పెళ్లయిన 2నెలలకే వేధించడం మొదలుపెట్టాడు. మొదట.. నువ్వుంటే చాలన్నవాడే.. ఆ తర్వాత కట్నం కావాలంటూ టార్చర్ స్టార్ట్ చేశాడు. దాంతో, కూతురి కోసం.. అల్లుడు అడిగినంత కట్నం ఇచ్చింది తల్లి. ఐదు లక్షల రూపాయల నగదు, 15 తులాల బంగారం ముట్టజెప్పింది. అయినా, అతని.. కట్నదాహం తీరలేదు. ఇంకా ఇంకా డబ్బు తీసుకురావాలని వేధించాడు. వికారాబాద్ జిల్లా తోర్ మామిడికి చెందిన దేవిక ఎంబీఏ పూర్తిచేసింది. హైదరాబాద్‌లోనే ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. 7 నెలల క్రితం పరిచయమైన మంచిర్యాలకు చెందిన సతీష్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది దేవిక. ఇరు కుటుంబాల అంగీకారంతో గోవాలో గ్రాండ్‌గా మ్యారేజ్ చేసుకున్నారు.. ఆ తర్వాత హైదరాబాద్‌లో అంతే గ్రాండ్‌గా రిసెప్షన్‌ని కూడా సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ తర్వాత రాయదుర్గం పరిధిలో ఓ ప్లాట్ తీసుకుని నివాసముంటున్నారు. అయితే, పెళ్లయిన రెండు నెలలకే ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయ్.. గొడవలు మొదలయ్యాయ్. ఈ గొడవలకు అదనపు కట్నమే కారణమంటోంది దేవిక తల్లి రామలక్ష్మి ఆరోపించింది. దేవిక మృతిపై అనుమానాలు ఉన్నాయంటున్నారు కుటుంబ సభ్యులు. అదనపు కట్నం కోసం తన కూతురిని భర్త శరత్ వేధించే వాడని చెబుతోంది. దేవికను కొట్టి చంపేసి.. ఫ్యాన్‌కు ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆందోళనకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# టార్గెట్ ఫిక్సయ్యింది?

హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ టార్గెట్ ఏంటి? ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ చేశారా? మంగళవారం నుంచి రెండురోజుల పాటు వివిధ పార్లమెంట్ నియోజకవర్గాలపై దృష్టి పెట్టారా? రెండు రోజులపాటు సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.

హైకమాండ్ కీలక సూచనలు

ఫిబ్రవరి 19న కాంగ్రెస్ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే కొత్త ఇన్‌ఛార్జులతో ఢిల్లీలో సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికలకు ఆయా ఇన్‌ఛార్జులే బాధ్యత వహించాల్సి ఉంటుందని నొక్కి వక్కానించారు. బూత్ లెవల్ నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత రాష్ట్రాల ఇన్ ఛార్జులదేనని తేల్చిచెప్పారు. ఒక విధంగా చెప్పాలంటే ఇన్‌ఛార్జులకు ఫుల్ పవర్ ఇచ్చేసింది పార్టీ హైకమాండ్.

పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా సమీక్షలు

తెలంగాణ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన నుంచి మీనాక్షి నటరాజన్ తనదైన శైలిలో అడుగులు వేస్తున్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ సెగ్మెంట్ల వారీగా మంగళవారం నుంచి సమీక్షలు చేయనున్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సమీక్షా సమావేశాలు మొదలుకానున్నాయి. మెదక్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాలపై సమీక్ష నిర్వహించనున్నారు. బుధవారం కరీంనగర్, ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంపై దృష్టి పెడతారు. ఈ సమావేశాలకు నియోజకవర్గాల మంత్రులు, ఇన్ ఛార్జి మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, పోటీ చేసిన అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులు హాజరు కావాలని పిలుపు ఇచ్చారు.

జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు

పార్టీ పరిస్థితులు, సమస్యలు, పరిష్కార మార్గాలపై ఆయా నేతలపై మీనాక్షి నటరాజన్ చర్చించనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటి నుంచే ఆమె ఫోకస్ చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమావేశాలు నిర్వహించనున్నారు. దీని తర్వాత జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కార్యకర్తలతో భేటీ కావాలని భావిస్తున్నట్లు గాంధీ వర్గాలు చెబుతున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామ స్థాయిలో జరగడంతో వాటిపై తొలుత దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం అయితే ఓటు బ్యాంక్ చెదిరిపోకుండా ఉంటుందన్నది హైకమాండ్ ఆదేశాలు. ఆ విధంగా ఆమె అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది.

ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టులపై నేతల దృష్టి

రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తర్వాత మీనాక్షి నిర్వహిస్తున్న ఫస్ట్ సమీక్ష సమావేశాలు ఇవే. నేతలు సైతం వీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. పెద్ద సంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. కొత్త ఇన్‌ఛార్జిని ప్రసన్నం చేసుకునేందుకు నేతలు సైతం సిద్ధమవుతున్నవారు.దీని తర్వాత సామాజిక వర్గాలకు నామినేటెడ్, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ పదవులు ఇస్తారనే వార్తలు లేకపోలేదు. పీసీసీ కార్యవర్గ కూర్పు ఈ నెల 20లోగా పూర్తి అవుతుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నామినేటెడ్ పదవుల్లో పెండింగ్ లో ఉన్నవాటిని భర్తీ చేయడానికి

## బిసిల సంక్షేమంపై వైసిపి మొసలి కన్నీరు

అమరావతి,ఏపీ శాసనమండలిలో ప్రశ్నోత్తరాలపై చర్చ వాడి వేడిగా జరిగింది. బీసీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై వైసీపీ సభ్యుల ఆరోపణలకు ధీటుగా మంత్రులు నారా లోకేష్, సవిత సమాధానం చెప్పారు. బీసీలకు గత వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌ను ఎలా హత్య చేశారో చర్చించేందుకు సిద్ధమా? అని లోకేశ్ సవాల్ విసిరారు. బీసీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో లోకేశ్ మాట్లాడారు. ఎమ్మెల్సీ అనంతబాబు దళితుడిని చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేయలేదా?చేశారా? అనేది వైకాపా సభ్యుడు త్రిమూర్తులు చెప్పాలి. వైకాపా హయాంలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారో ఆ పార్టీ సభ్యులు చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ...నా బీసీలు అంటూ గొప్పలు చెప్పిన జగన్.. గత ఐదేళ్ల పాలనలో బీసీలకు ద్రోహం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లోనే రూ. 1,977 కోట్లు స్వయం ఉపాధి పథకాలకే కేటాయించాం. రూ.200 కోట్లతో 1.2 లక్షల మందికి ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తూ కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నాం. బీసీల కోసం కార్పొరేషన్ల ద్వారా రాయితీపై రుణాలు అందిస్తున్నాం. ఆదరణ పథకానికి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాం. 26 జిల్లాల్లో బీసీ భవన్‌లను నిర్మించబోతున్నాం అని మంత్రి తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాలు మరమ్మతులు చేస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

## ఈ నెలలోనే మెగా డిఎస్సీ విడుదల

అమరావతి,ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే భాధ్యత తమదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదని, 1.82 లక్షల పోస్టులు గత టీడీపీ హయాంలోనే భర్తీ చేశాం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో రెండోరోజు ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతిపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానాలు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. 1.82 లక్షల పోస్టులు గత టీడీపీ హయాంలోనే భర్తీ చేశాం. ఎట్టి పరిస్థితుల్లోను మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే భాధ్యత మాది. వాస్తవాలు తెలుసుకుని వైసీపీ సభ్యులు మాట్లాడాలి' అని అన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని త్వరలోనే అమలు చేయనుందని, ఇందుకు సంబంధించిన గైడ్ లైన్స్ త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. తల్లికి వందనం పథకానికి బ్జడెట్లో రూ.9,407 కోట్లు కేటాయించినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. తల్లికి వందనం పథకంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.

## కారు రివర్స్ గేర్!

హైదరాబాద్, ఒకప్పుడు ఆ జిల్లా బీఆర్ఎస్‌కి కంచుకోట. కానీ ఇప్పుడు ఆ జిల్లాలో పార్టీ క్యాడర్‌కి ధైర్యం చెప్పే బాస్ కరువయ్యాడట. గత 10 ఏళ్లలో 8 నుంచి 9 ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకున్న గులాబీ పార్టీ పరిస్థితి అక్కడ అంత దయనీయంగా ఎందుకు తయారైంది? ఆ జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకు ఎందుకు ముఖం చాటేస్తున్నారు?. పార్టీ అధినేత ఆదేశాలను సైతం ఎందుకు పట్టించుకోవడం లేదు? అసలింతకీ ఆ జిల్లా ఏది? అక్కడ గులాబీ పార్టీలో ఏం జరుగుతుంది?నిజామాబాద్ జిల్లాలో తాజా మాజీ ఎమ్మెల్యేల తీరు పై.. గులాబీ క్యాడర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కష్ట కాలంలో ఉంటే.. నేతలు నియోజకవర్గానికి ముఖం చాటేస్తుండటం కార్యకర్తలకు మింగుడు పడటం లేదంట. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిస్తే జిల్లాలో సగానికి పైగా నియోజకవర్గాల్లో అసలు ఉలుకు పలుకే ఉండటం లేదంట. బాల్కొండ లో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అడపాదడపా నియోజకవర్గంలో పర్యటిస్తూ క్యాడర్‌ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.కామారెడ్డిలో బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అయినట్లే అంటున్నారట. బాన్సువాలో మాజీ మంత్రి, మాజీ స్పీకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అధికార పార్టీలో చేరి కారు టైర్లను పంచర్ చేశారు. దాంతో అక్కడ గులాబీ పార్టీకి లీడర్ లేకుండా పోయాడు. ఆర్మూర్‌లో మొక్కుబడిగా కనిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కేసీఆర్ ఫామ్హౌస్‌లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారంట. బోధన్‌లో మాజీ ఎమ్మెల్యే షకీల్ అయితే ఓడినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గం ముఖం చూడలేదు. షకీల్ దుబాయ్‌కి పరిమితం అవ్వడంతో ఆయన భార్య భార్య అయేషా ఫాతిమా ఇన్చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే రాజకీయాలకు పూర్తిగా కొత్త అయిన ఆమె క్యాడర్‌ని కపడుకోలేక పోతున్నారు.ఇక నిజామాబాద్ అర్బన్, రూరల్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గ నేతలు కేటీఆర్ ఆదేశాలను కూడా లైట్ తీసుకున్నారట. ముందుండి నడిపించే నాయకుడు లేక పోవడంతో ఆ నియోజకవర్గాల్లో పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను కూడా నిర్వహించే దిక్కు లేకుండా పోయిందంట. జామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పార్టీ దాదాపుగా ఖాళీ అయ్యిందట. మొన్నటి వరకు మేయర్‌గా బీఆర్ఎస్ నాయకుడు కొనసాగినప్పుడు అంతో ఇంతో హడావుడి కనిపించేది. అయితే కౌన్సిల్ కాలం చెల్లి మేయర్ పదవీ కాలం అయిపోవడంతో అర్బన్‌లో పార్టీకి లీడర్ లేకుండా పోయాడంట. మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్‌గుప్తా పార్టీని వీడే వారిని బుజ్జగించే ప్రయత్నం కూడా చేయడం లేదంట.నిజామాబాద్ రూరల్ లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి అనంతరం. నియోజకవర్గం లోనే ఉన్నప్పటికీ.. ఆయన యాక్టివ్‌గా లేకపోవడంతో గులాబీ క్యాడర్ మొత్తం హస్తం గూటికి క్యూ కట్టారట. అధిష్టానం ఇప్పుడు రూరల్ నుంచి కాకుండా గతంలో బాన్సువాడ ఎమ్మెల్యే గా అనుభవం ఉన్న బాజిరెడ్డిని మళ్ళీ వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచే పోటీ చేయాలని చెపుతున్నా.. ఆయన సుముఖంగా లేరన్న ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీ క్యాడర్ని ఉత్సాహపరచడానికి జిల్లాలో పర్యటిస్తున్నా.. నేతలు, వారి సహకారం కరువవ్వడంతో పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టు అన్నట్లు తయారైందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.. ఓవరాల్‌గా చూస్తే జిల్లాలో కారు .. రివర్స్ గేర్లో .. ఫుల్ స్పీడ్‌తో.. పరుగులు పెడుతున్నట్లు కనిపిస్తోందిప్పుడు.

## కష్టంతో కాకుండా ఇష్టంతో పరీక్షలు రాయండి

హైదరాబాద్,కష్టంతో కాకుండా ఇష్టంతో పరీక్షలు రాయాలని ఎమ్మెల్సీ కవిత విద్యార్థులకు సూచించారు. ఇంటర్ పరీక్షలు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ నేపథ్యంలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని కవిత కోరుకున్నారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థులకు కవిత ఆల్ ది బెస్ట్ చెప్పారు.

# జాగ్రత్త.. గురూ! ఎన్ని వందల కోట్ల మోసమంటే.. ?



హైదరాబాద్,పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ! తక్కువ టైమ్‌లో.. ఎక్కువ ఆదాయం! ఇంట్లో నుంచే.. బీరువాల నిండా సంపాదించండి! ఇలాంటి ప్రకటనలతో.. ముందూ వెనకా ఆలోచించకుండా.. అత్యాశకు పోయి ఎంతో మంది భారీగా నష్టపోతున్నారు. నెట్‌వర్కింగ్ పేరుతో కొందరు కేటుగాళ్లు నట్టేట ముంచేస్తున్నారు. బిజినెస్, ప్రొడక్ట్, మార్కెటింగ్ అంటూ తెలివిగా మోసం చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో.. ఈ తరహా మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు పెరిగిపోయాయ్. ఇప్పటికైనా మేలుకోని.. తేరుకోకపోతే.. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

**డబ్బుల ఆశకుపోతే.. అడ్డంగా బుక్కైపోతారు!**

తక్కువ టైంలో ఎక్కువ లాభాలు ఆర్జించొచ్చు. ఎంతమంది ఏజెంట్లని చేర్పిస్తే అన్ని రివార్డులు, పాయింట్లు, రిఫర్ చేస్తే బోనస్‌లు వస్తాయని ఆశ చూపే దందాలు ఈ మధ్యకాలంలో ఎక్కువైపోయాయ్. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ఈ దేశంలో మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు మళ్లీ పెరుగుతున్నాయ్. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, హెర్బల్ ప్రొడక్ట్స్, హెల్త్ కేర్ ఉత్పత్తులు, క్రిప్టో కరెన్సీ, నిత్యవసర వస్తువులు, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్, ఎలక్ట్రిక్ బైకుల అమ్మకాల పేరిట అడ్డంగా మోసం చేస్తున్నారు. పిరమిడ్ మోడల్ తరహా మోసాలు చేసే కేటుగాళ్లంతా.. ఇప్పుడిదే పనిలో ఉన్నారు. తమ దగ్గర ప్రొడక్టులు కొని మార్కెట్‌లో విక్రయిస్తే.. భారీ లాభాలు వస్తాయని చెప్పి.. జనం ఆశల్ని, అమాయకత్వాన్ని క్యాష్ చేసుకునే ఏజెంట్లు ఎందరో ఉన్నారు.

**వి-కెన్, ఆమ్ వే, క్యూ నెట్, వెస్టీజ్, హెర్బల్ లైఫ్**

వి-కెన్, ఆమ్‌వే, క్యూ నెట్, వెస్టీజ్, హెర్బల్ లైఫ్, సంకల్ప్ మార్ట్, %ణఖ్గ% టెక్నాలజీస్, ఫ్రైడే అప్ కన్సల్టెన్సీస్.. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్ చాంతాడంత ఉంటుంది. ఈ జాబితాలోనే ఇప్పుడు చేసింది %ూణమీా వ%-బైక్స్.. ప్రతిసారీ కంపెనీ పేరు మారుతుంది. దాని బిజినెస్ మారుతుంది. అందులోని స్కీమ్ మారుతుంది కానీ.. స్కామ్ మాత్రం మారదు. అదే స్క్రిప్ట్, అదే సినిమా. అందులో క్యారెక్టర్స్ మారతాయి కానీ.. మోడల్ మారదు. లైఫ్‌లో సక్సెస్ అయ్యేందుకు.. దీనిని మించిన అవకాశం మరొకటి లేదు.. రాదు అని కథలు చెబుతారు. మిమ్మల్ని మోటివేట్ చేస్తారు. బ్రెయిన్ వాష్ చేస్తారు.

**వందల కోట్లు వసూళ్లు చేసి.. బోర్డు తిప్పేసిన కంపెనీలెన్నో!**

వాళ్ల దారిలోకి తెచ్చుకుంటారు. మనల్ని మోసం చేయడమే కాదు.. మన చేత మరో నలుగురైదుగురిని మోసం చేయమని చెబుతారు. డబ్బుల మీదున్న ఆశతో.. ఎంతో మంది అమాయకులు ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీల ఏజెంట్లు చెప్పింది విని మోసపోతున్నారు. వాళ్లు చెప్పినట్లుగా చేస్తూ.. మిగతా వాళ్లు కూడా నష్టపోయేందుకు కారకులవుతున్నారు. ఇలా.. వందల కోట్లలో వసూలు చేసి.. బోర్డు తిప్పేసిన కంపెనీల లిస్టు చాలానే ఉంది. ఈజీగా మనీ వస్తుందని ఆశపడితే.. తర్వాత నష్టపోవాల్సిందే మీరేనని మార్కెట్ నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**కొత్తగా మార్కెట్లోకి వచ్చి స్కామ్ %ూణమీా% ఈ బైక్స్**

ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోడల్‌లో.. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన స్కామే.. %ూణమీా% ఈ-బైక్స్. బైక్‌ల పేరుతో వ్యాపారం మొదలుపెట్టిన కంపెనీ.. ఆ బైక్‌లు అమ్మకుండా.. చైన్ మార్కెటింగ్ వ్యాపారం చేస్తోంది. రిజిస్ట్రేషన్, మెంబర్‌షిప్, ఐడీ జనరేషన్ అని చెబుతూ.. జనాల నుంచి డబ్బులు వసూలు చేసి.. వారినే మార్కెటింగ్ ఏజెంట్లుగా మార్చేస్తోంది. జనం డబ్బుతో.. వాళ్లు వ్యాపారం చేస్తూ.. వేల కోట్లు వెనకేస్తున్నారు. కొద్దో గొప్ప డబ్బులకు ఆశపడి.. ఈ స్కీమ్‌లో ఏజెంట్లుగా చేరుతున్న వాళ్లెందరో ఉన్నారు.

**విదేశాల్లో ఉండి పిరమిడ్ రాకెట్ నడుపుతున్న కేటుగాళ్లు**

ఎప్పుడైతే.. సైబర్ మోసాలపై జనంలో అవగాహన పెరగడం మొదలైందో.. కేటుగాళ్లంతా ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌పై కన్నేశారు. చైన్ బిజినెస్ పేరుతో.. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ద్వారా ప్రకటనలు గుప్పించి.. అమాయకులను మోసగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీములు నడిపే కేటుగాళ్లలో.. చాలా మంది మంది విదేశాల్లోనే ఉండి ఈ పిరమిడ్ రాకెట్ నడుపుతుంటారు. భారీ లభాలతో పాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట.. ఏజెంట్ల ద్వారా అమాయకులకు వల వేస్తున్నారు.

**పెద్ద మొత్తంలో జమ అయ్యాక జెండా పీకేసే కంపెనీలు**

ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలన్నీ.. స్టాలిన్ సినిమా తరహాలోనే ఉంటాయ్. నువ్వో ముగ్గురికి సాయం చెయ్.. ఆ ముగ్గురిని మరో ముగ్గురి చొప్పున సాయం చేయమని చెప్పండి లాగే ఉంటుంది వ్యవహారం. ఇలా చైన్ సిస్టమ్ ద్వారా డబ్బులు కట్టించుకోవడం, పెద్ద మొత్తంలో జమ అయ్యాక జెండా పీకేయడం ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నదే! ఇప్పుడు.. ఈ-బైక్స్ పేరుతో ఏడీఎంఎస్ చేస్తున్నది కూడా ఇదే దందా. కొన్ని కంపెనీలు తమ దగ్గర ప్రొడక్ట్స్ కొని.. మార్కెట్‌లో సేల్ చేసుకోమని చెబుతాయ్. ఇంకొన్ని.. కచ్చితంగా ప్రతి నెలా తమ ఉత్పత్తుల్ని కొనాల్సిందే అంటాయ్. తర్వాత.. మిగతా వాళ్లని కూడా చేర్పించమని చెబుతాయ్. కానీ.. ఏడీఎంస్ అలా కాదు.

**బైక్ కొనాల్సిన అవసరం లేదంటున్న ఏడీఎంస్ కంపెనీ**

పైకి.. ఎలక్ట్రిక్ బైక్స్ వ్యాపారంగానే కనిపిస్తున్నా.. బైక్ కొనాల్సిన అవసరం లేదంటున్నారు. బైక్ కొనడానికి వెళితే.. 16 వేలు కట్టించుకొని.. ఐడీ ఇచ్చేస్తున్నారు. మరో ఇద్దరిని చేర్పిస్తే.. బోనస్ డబ్బులొస్తాయని ఆశ పెడుతున్నారు. 16వేలు కట్టలేని వారి కోసం 8వేలు కడితే చాలంటూ ఇంకో స్కీమ్ తీసుకొచ్చారు. ఇప్పటికే.. ఇలా 2 లక్షల మందికి పైగా డబ్బులు కట్టేశారు. ఒక వేళ నిజంగానే.. ఏడీఎంస్ కేవలం ఈ-బైక్స్ వ్యాపారమే చేస్తున్నట్లయితే.. రెండు తెలుగు రాష్ట్రాల్లో రోడ్ల మీద ఎన్నో ఏడీఎంఎస్ బైక్స్ కనిపించేవి. కానీ.. ఆ పరిస్థితి లేదు. అక్కడ జరుగుతున్నదంతా.. చైన్ సిస్టమ్, మనీ సర్క్యులేషన్. జనం డబ్బుల్ని.. జనానికే ఇస్తూ.. పై స్థాయిలో వాళ్లు భారీగా లాభపడుతున్నారు.

**రూ.16వేలు కట్టాక 2 ఆఫర్లు ఇస్తున్న కంపెనీ ప్రతినిధులు**

ఏడీఎంస్ బైక్ కొనేందుకు వెళ్లినవారు.. 16 వేలు కట్టాక కంపెనీ ప్రతినిధులు రెండు రకాల ఆఫర్లు ఇస్తారు. ఒకటి.. బైక్ కొనుగోలు చేయడం, మరొకటి.. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ప్లాన్. 16 వేలు కట్టండి, మరో ఇద్దరితో 16 వేల చొప్పున కట్టించండి. 10 వేల కమీషన్ పట్టండి అంటూ కమిట్ చేయిస్తున్నారు. తాము ఇప్పటికే కోట్లలో సంపాదించామని.. బ్రెయిన్ వాష్ చేస్తున్నారు. వేలు కట్టండి.. కోట్లు సంపాదించండి అంటూ.. ఇప్పుడు జనాన్ని ముంచే పనిలో ఫుల్ బిజీగా ఉంది ఏడీఎంస్ కంపెనీ. ముందు నువ్వు డబ్బు కట్టు, తర్వాత మరో ఇద్దరితో కట్టించు, కమీషన్ కొట్టు అంటూ.. ఇప్పటికే వందల కోట్లు దండుకుంది. ఇలా ఏకంగా 40 వేల కోట్లు కొల్లగొట్టేందుకు మాస్టర్ ప్లాన్ వేసింది.

**జనంతో ప్రొడక్ట్స్ భారీగా కొనుగోలు చేయించే స్కీమ్**

మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయ్. ఈ కంపెనీలు.. తమ డైట్ సప్లిమెంట్ల నుంచి క్లీనింగ్ ప్రొడక్ట్స్ వరకు ఏవైనా జనం భారీగా కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తాయ్. ఆ తర్వాత వీటిని సేల్ చేయడం ద్వారా ప్రజలు ఆదాయాన్ని సంపాదించే వీలుందని చెబుతాయి. నిజానికి ఇలాంటి కొన్ని స్కీమ్‌లలో భారీగా ఏజెంట్లను నియమించుకోవడం ద్వారా కంపెనీలు డబ్బులు సంపాదిస్తూ ఉంటాయ్. కింది స్థాయిలో జనం పెట్టే డబ్బు ద్వారానే.. పైస్థాయిలో ఉండేవారికి లాభాలు వస్తుంటాయ్.

**ఏజెంట్లకు వస్తాయని చెప్పే లాభాలు.. వాళ్ల పైనున్న వాళ్లకొస్తాయి**

కాబట్టి.. నిజమైన వినియోగదారుల నుంచి వచ్చే డబ్బు కంటే.. డబ్బులు కట్టి ఏజెంట్లుగా జాయిన్ అయ్యే వాళ్ల నుంచే కంపెనీకి ఎక్కువ లాభాలు వస్తుంటాయ్. అంటే.. ఈ ఏజెంట్లకు వస్తాయని చెప్పే లాభాలు.. వాళ్ల పైనున్న వాళ్లకొస్తాయ్. మరింత మంది ఏజెంట్లని నియమించుకునేందుకు.. కిందున్న వాళ్లపై కంపెనీలు విపరీతంగా ఒత్తిడి చేస్తాయ్. దానికోసం.. ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ ఏజెంట్లు ఎంతదూరమైనా వెళ్తారు. మరోవైపు.. తమ డబ్బులు షెల్ కంపెనీల ద్వారా చేతులు మారుతున్న విషయం.. ఈ స్కీమ్‌లో చేరే వారికి కూడా తెలియదు.

**అద్భుతమైన వ్యాపార అవకాశం అంటూ ప్రకటన**

ముందుగా.. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌లో తక్కువ పెట్టుబడితో.. అద్భుతమైన వ్యాపార అవకాశం అంటూ ప్రకటనలిస్తారు. వాటికి ఆకర్షితులై స్కీమ్‌లో చేరాక.. ప్రొడక్ట్స్ అమ్మడం కంటే కొత్త వారిని చేర్పించడం మీదే ఎక్కువ ఫోకస్ చేస్తారు. వాళ్ల టార్గెట్ కూడా అదే. అలా.. కొత్తగా చేరిన వారితో.. మొదట వారి కుటుంబ సభ్యులు, తర్వాత స్నేహితులు, సోషల్ మీడియా ఫ్రెండ్స్, డేటింగ్ యాప్స్.. ఇలా చాలా మార్గాల ద్వారా కొత్త ఏజెంట్లని నియమించాలని ఒత్తిడి చేస్తారు. తమ ఫోన్లలో తమకు బాగా తెలిసిన వారు, పరిచయం ఉన్నవారి నెంబర్లతో.. కాంటాక్ట్‌లోకి వెళ్లాలని సూచిస్తారు. మీరు ప్రొడక్ట్స్ అమ్మాలనుకుంటే.. మొదటగా మీకు నెట్‌వర్క్ ఉండాలని చెబుతారు. అంతేకాదు.. సోషల్ మీడియా ప్రొఫైల్ కూడా ఆకర్షణీయంగా కనిపించాలని ప్రెజర్ చేస్తారు.

**ఏజెంట్లని ఫ్యామిలీ కంటే ఎక్కువ నమ్మాలని కొత్తవారికి సూచన**

ఇతరుల దగ్గర్నుంచి తీసుకున్న ఖరీదైన ఆభరణాలు, బట్టలు వేసుకొని ఫోటోషూట్లు కూడా చేయమంటారు. ఏదైనా బ్రాండెడ్ వస్తువుతో ఫోటోలు దిగితే.. చాలా మంది వాళ్లంతట వాళ్లే మీ టచ్‌లోకి వస్తారని చెబుతారు. ఆ సమయంలో.. ఈ స్కీమ్ విషయం గురించి చెప్పి.. తమకెంతో ఆదాయం వస్తోందనే విషయం చెప్పాలని సూచిస్తారు. ఈ విధమైన మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్‌లతో చేరే వారి కోసం.. భారీ జూమ్ మీటింగ్‌లు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు, పార్టీలు కూడా ఏర్పాటు చేస్తారు. ఏజెంట్లని.. ఫ్యామిలీ కంటే ఎక్కువ నమ్మాలని.. కొత్తవారికి సూచిస్తారు. వారికి వ్యతిరేకంగా మాట్లాడినా.. ఎదురు ప్రశ్నించినా దారుణంగా ప్రవర్తిస్తారు. వందలాది మంది సీనియర్ ఏజెంట్లు ఉండే వాట్సాప్ గ్రూపులో.. తమ పేరుని పదే పదే చెబుతూ అవమానిస్తారు.

**అతి తక్కువ సమయంలో అధిక లాభాలంటే.. అది మోసమే!**

అయితే.. అతి తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే.. కచ్చితంగా అది మోసమేనని గ్రహించాలి. లేకపోతే.. మిమ్మల్ని ఆ స్కామ్‌లోకి దించి.. మీ డబ్బులు కొల్లగొడతారు. అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. ఈ చైన్ మార్కెటింగ్‌లో.. ముందు చేరిన వారికే లాభాలు వస్తాయి. ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. అందువల్ల.. ఇలాంటి నెట్‌వర్క్‌ల్లో ఎవరూ చేరొద్దు. ఆ కంపెనీలు పెట్టే మీటింగ్‌లకు కూడా వెళ్లొద్దు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసపూరిత ప్రకటనలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు పోలీసులు. పిరమిడ్ విధానంలో చేసే మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్‌ల్లో.. మొదట జాయిన్ అయిన వారికే డబ్బులొస్తాయని చెబుతున్నారు. కొన్నాళ్ల తర్వాత.. చివరికి జాయిన్ అయినవారు పెద్ద ఎత్తున నష్టపోతారని హెచ్చరిస్తున్నారు.

**కూర్చున్న చోటే.. కాసుల వర్షం!**

ఒకప్పుడు వారం స్కీములు,నెలవారీ లాటరీలు అంటూ మోసం చేసేవారు. మాయమాటలు చెప్పి డబ్బులు కట్టించుకునేవారు. తర్వాత.. పెద్ద మొత్తంలో జమవగానే ఆ సొమ్ముతో ఉడాయించేవారు.ఇప్పుడు.. రోజులు మారాయ్. టెక్నాలజీ పెరిగింది. అంతా హైలెవెల్ మార్కెటింగ్ మోసాల ట్రెండ్ నడుస్తోంది. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ సంపాదన! కూర్చున్న చోటే.. కాసుల వర్షం! లాంటి ఏదో ఒక స్కీమ్ పేరుతో..భారీ స్కామ్‌లకు పాల్పడుతున్నారు కేటుగాళ్లు.అందు వల్ల.. మల్టీ లెవెల్ మార్కెటింగ్ బిజినెస్‌ల జోలికి వెళ్లొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

**మల్టీ లెవెల్ మార్కెటింగ్ బిజినెస్ లు జోలికి వెళ్లొద్దని సూచన**

ఇలా నిబంధనలకు విరుద్ధంగా నడిచే ఈ విధమైన స్కీమ్‌లకు వ్యతిరేకంగా ఎన్నో చట్టాలున్నాయ్. ప్రధానంగా.. సెమీ అర్బన్, రూరల్ ఏరియాల్లోని ప్రజల్ని ఆకర్షించి ఈ స్కీముల్లో జాయిన్ చేస్తున్నారు. హొటల్స్, ఫంక్షన్ హాల్స్‌లో మీటింగ్స్ ఏర్పాటు చేసి.. వీటి గురించి చెబుతుంటారు. ఇలాంటి స్కీముల్లో ఎవరూ చేరొద్దు. ఒకవేళ మీ దగ్గరలో ఇలాంటి మీటింగులు జరిగితే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

# జనసేన మీద టీడీపీకి మండుతోందా ?

అమరావతి,రాజకీయాలు అంటేనే అవకాశాలను అందిపుచ్చుకోవడం. ఒక పార్టీకి మరో పార్టీ ఎన్నికల సమయంలో తప్ప ఎపుడూ అంత మిత్రుత్వం ఉండదు, ఆ విధంగా చూస్తే కనుక కూటమి కట్టిన పార్టీలలోనూ విభేదాలు ఉంటాయంటే అతిశయోక్తి కాదు, అది అత్యంత సహజం కూడా. పాలిటిక్స్ అంటే చాన్స్ కోసం రేసింగ్. ఆ సమయలో ఎవరూ ఫ్రెండ్ షిప్ కోసం త్యాగాలు చేసే సీన్ అయితే ఉండదు.ఇదంతా ఎందుకు అంటే టీడీపీ జనసేన ఈ రెండూ మిత్ర పక్షాలు కదా మరి ఈ రెండు పార్టీల మధ్య బంధాలు ఎలా ఉన్నాయన్న ఆలోచనలు రావడమే. కూటమిగా మూడు పార్టీలు ఏర్పడి తొమ్మిది నెలలుగా అధికారాన్ని అందుకుంటున్నాయి. అయితే దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకునే చందంగా ఆయా పార్టీలు వైసీపీ నుంచి నేతలను చేర్చుకునే పనిలో పడ్డాయి.ఈ విషయంలో మొదట్లో టీడీపీ జోరు చూపించినా ఇపుడు జనసేన దూకుడు చేస్తోంది. ఇక చూస్తే కనుక కూటమిలో ఎవరిని అయినా చేర్చుకోవాలి అనుకుంటే కనీసం చర్చ జరగాలి అని అంటున్నారు. అయితే అలాంటి చర్చలేమీ లేకుండా ఏ పార్టీకి ఆ పార్టీ చేరికలను ప్రోత్సహిస్తోంది. జనసేన ఆ విధంగా వైసీపీ అసంతృప్తులను చేర్చుకుంటోంది. తాను రానున్న రోజులలో సొంతంగా ఎదగాలని జనసేన తాపత్రయపడుతోంది. ఈ విషయం పెద్దన్నగా ఉన్న పార్టీ టీడీపీ పసిగట్టకుండా ఉంటుందా. అందుకే టీడీపీ జనసేన రాజకీయ కార్యకలాపాలు జాగ్రత్తగా గమనిస్తోంది.ఇక జనసేన అధినాయకత్వం పక్కా వ్యూహంతోనే ఇదంతా చేస్తోంది. జనసేనకు 2024 ఎన్నికల్లో కేవలం 6.5 ఓటు శాతం మాత్రమే వచ్చింది. దాంతో మరింతగా బలపడేందుకు ప్రతీ నియోజకవర్గంలో బలమైన నేతలను చేర్చుకునేందుకు రెడీ అవుతోంది. ఒకటి రెండు సార్లు గెలిచిన వారు ఆయా నియోజకవర్గాలలో కనీసంగా 20 శాతం ఓటు షేర్ ని సొంతంగా కలిగి ఉంటారని భావిస్తూ అలాంటి వైసీపీ నేతలనే జనసేనలోకి చర్చుకోవడానికి చూస్తోంది అని అంటున్నారు.ఈ విధంగా ప్రతీ నియోజకవర్గంలో 20 శాతం ఓటు షేర్ తక్కువ కాకుండా ఉన్న బలమైన నాయకులను చేర్చుకోవడం ద్వారా 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే జనసేన పూర్తిగా ప్రిపేర్ అవుతోంది. ఆనాటి ఎన్నికల్లో కనుక తన ఓట్లూ సీట్లూ గణనీయంగా పెంచుకుంటే సీఎం సీటుని షేరింగ్ లో భాగంగా డిమాండ్ చేయవచ్చు అన్నది జనసేన ఆలోచనగా ఉందని చెబుతున్నారు.మహారాష్ట్రలో మాదిరిగా కూటమి కట్టి ఆయా పార్టీల బలాబలాలను బట్టి సీఎం సీటు షేరింగ్ తో అధికారం అనుకుంటున్నారు అని జనసేన భావిస్తోంది. ఆ తరహా రాజకీయాన్ని ఏపీలో కూడా అమలు చేయాలని చూస్తోంది అంటున్నారు.ముందు పార్టీని బలోపేతం చేసుకుని ఏకంగా 20 శాతం ఓటు షేర్ ని ఏపీలో జనసేన సాధించాలన్నది ఆ పార్టీ అధినాయకత్వం టార్గెట్ గా ఉందని అంటున్నారు.




ఆ విధంగా చేస్తే కనుక కచ్చితంగా తమ ఓటు షేర్ చూసి అయినా టీడీపీ కాళ్ళ బేరానికి వస్తుందని అపుడు సీఎం షేర్ అన్నది ఒక డిమాండ్ గా పెట్టినా ఓకే చేసేందుకు నూరు శాతం అవకాశాలు ఉంటాయని జనసేన వ్యూహకర్తలు భావిస్తున్నారు.అంతే తప్ప తాము చిన్న పార్టీగా ఉంటూ చంద్రబాబు వద్ద ప్రాపకం కోసం ఎన్నాళ్ళు చేసినా ఇబ్బందిగానే ఉంటుందని జనసేన తలపోస్తోంది. మొత్తానికి పక్కా రాజకీయ వ్యూహంతోనే ఈ చేరికలను జనసేన ప్రోత్సహిస్తోంది అని అంటున్నారు.ఇక చూస్తే కనుక సామాజిక వర్గ సమీకరణలను జనసేన కాచి వడపోస్తోంది. కోస్తా జిల్లాలలో కాపుల సంఖ్య అధికంగా ఉంది. వారు అనేక నియోజకవర్గాలలో గెలుపు ఓటములను శాసించే స్థితిలో ఉన్నారు. దాంతో జనసేన గుంటూరు నుంచి ఉత్తరాంధ్రాలోని శ్రీకాకుళం వరకూ ఉన్న కాపులను పోలరైజ్ చేసి జనసేన వైపుగా నడిపిస్తఒంది. ఇలా చేయడం వల్ల తాము కీలకమైన పార్టీగా ఏపీలో ఎదుగుతామని లెక్కలేస్తోంది.అదే సమయంలో గ్రేటర్ రాయలసీమను కూడా పవన్ కళ్యాణ్ ఒక వైపు చూస్తూనే గట్టిగా ఫోకస్ పెడుతున్నారు. రాయలసీమ నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో కాపులు బలిజలుగా ఉన్నారు. అయితే వారు రాజకీయంగా అంత చైతన్యవంతంగా లేరు. దాంతో వారిని జనసేన వైపుగా ఆకట్టుకుంటే అక్కడ కూడా జనసేన బలంగా మారడం పెద్ద కష్టమేమీ కాదన్నది పవన్ మార్క్ పొలిటికల్ థియరీగా ఉంది అంటున్నారు.మొత్తం మీద చూస్తే పవన్ రాజకీయం చాలా దూరదృష్టితోనే ఉంది. ఆయన మెల్లగా ఏపీ రాజకీయాల్లో జనసేనను థర్డ్ ఫోర్స్ గా బలంగా ఎస్టాబ్లిష్ చేయాలని చూస్తున్నారు. ఆయన టీడీపీతో పొత్తులో ఉంటూ వైసీపీని దెబ్బతీయడం ద్వారా ఆ ప్లేస్ లోకి వెళ్ళాలని అనుకుంటున్నారు. అంతవరకూ పొత్తులు ఉండాలని భావిస్తున్నారు.అయితే టీడీపీకి జనసేన బలపడడం ఒక విధంగా ఇబ్బందికరమే అని అంటున్నారు. రెండు పార్టీల ఓటు బ్యాంక్ దాదాపుగా ఒక్కటే కావడంతో వైసీపీని బలహీనం చేసినా ఆ ప్లేస్ లో జనసేన

## జగన్ ప్రభుత్వంపై విషం చిమ్మే యత్నం

అమరావతి,టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతి సందర్భంలోను గత ప్రభుత్వ విధ్వంసం అంటూ ప్రజల మనస్సుల్లో కాలకూట విషం నింపే ప్రయత్నం చేస్తోందని.. ఎవరిది విధ్వంసం అనేది ప్రజలకు తెలుసునని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కుంభ రవిబాబు నిప్పులు చెరిగారు.బడ్జెట్‌పై మండలిలో చర్చ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దు?రప్పచారాలను తూర్పారబట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో సాధించిన ప్రగతిని అంకెలు, రుజువులతో సహా వివరించారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని రవిబాబు అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, కూటమి నేతలు కలిసి రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఎప్పటిలాగే తన మేనిఫెస్టోను ఏ చెత్తబుట్టలో వేశారో ప్రజలు గమనిస్తున్నారు. విశాల తీర ప్రాంతాన్ని వినియోగించుకుని ఏడు పోర్టులు నిర్మించి రాష్ట్రానికి ఆదాయాన్ని పెంచే ప్రయత్నం చేయడం విధ్వంసమా? ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టి రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు విప్లవాత్మక చర్యలు తీసుకోవడమే విధ్వంసమా? ఇక కనీవినీ ఎరుగని రీతిలో ఏకంగా రూ.32వివేల కోట్లు ఖర్చుపెట్టి ప్రాథమిక విద్యలో మౌలిక వసతులు కల్పించడం విధ్వంసమా? నవరత్నాల ద్వారా డీబీటీ పద్ధతిలో రూ.2.70 లక్షల కోట్లకు పైగా ప్రజల ఖాతాలకు నేరుగా జమ చేయడం విధ్వంసమా? ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తనం నుంచి ధాన్యం సేకరణ వరకు సేవలు అందించడం విధ్వంసమా? ఏకంగా 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మాణం చేపట్టడం విధ్వంసమా? 2.36 లక్షల మంది వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే అందించడం విధ్వంసమా?.. లేక ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బ్జడెట్‌లో కోతవిలు పెట్టిన చంద్రబాబు విధ్వంవిసవికారుడా? ఎవవిరు విధ్వంసకారుడు? ఎవరు విధ్వంసం సృష్టిస్తున్నారో అనేది ప్రజలు ఇప్పటికే గుర్తించారు. టీడీపీ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్ ఆర్థిక అరాచకాన్ని సృష్టిస్తే.. అందులోంచి బయటకు రావడానికి చంద్రబాబు అధ్యక్షతన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర వ్యవస్థను గాడిలో పెట్టేలా రూ.3,22,359 కోట్లతో బడ్జెట్ పెట్టారన్నారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిని విధ్వంసం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ అరాచకాలను సరిదిద్దడానికి చంద్రబాబు సమీక్షలు పెడితే ఐదేసి గంటలు పడుతోందన్నారు.

# అదృశ్య నేతకే అధ్యక్ష పీఠం?!



న్యూఢిల్లీ,భారతీయ జనతా పార్టీ కాబోయే జాతీయ అధ్యక్షుడు ఎవరు? ఈ ప్రశ్న జాతీయ రాజకీయాల్లోనే కాదు,రాష్ట్ర రాజకీయాల్లోనూ ప్రముఖంగా వినవస్తోంది. నిజానికి, బీజేపీ జాతీయ అధ్యక్షుల రేసులో ఈ సారి ఉత్తారాది రాష్ట్రాల నేతలతో పాటుగా దక్షణాది రాష్ట్రాల నేతలూ పోటీ పడుతున్నారు. అందులోనూ తెలుగు రాష్ట్రాల నాయకుల పేర్లు మరింత ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అవును. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వంటి తెలుగు పేర్లు కూడా ఈ జాబితాలో ఉండడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరీ ముఖ్యంగా బీజేపీ శ్రేణుల్లో ఆసక్తి వ్యక్తమవుతోంది. నిజానికి బీజేపీ దక్షణాది రాష్ట్రాలపై దుష్టి కేంద్రీకరించిందని వార్తలు వస్తున్న నేపధ్యంలో గత కొంత కాలంగా ఈ సారి బీజేపీ అధ్యక్ష పదవి దక్షిణాది రాష్ట్రాలకు దక్కుతుందనే కథనాలు ఇటు మీడియాలోనే కాదు, అటు పార్టీ వర్గాల్లోనూ వినిపిస్తున్నాయి. అలాగే ఈ సారి, సీనియర్లు ఎవరికీ చోటు ఉండదని కొత్త తరానికి పగ్గాలు అప్పగించాలనే నిర్ణయం ఇప్పటికే జరిగిన నేపధ్యంలో, ఇంత వరకు జాతీయ స్థాయిలో పేరున్న శివరాజ్ సింగ్ చౌవాన్ వంటి నేతలకు అవకాశం ఉండక పోవచ్చని అనటున్నారు. అలాగే దక్షణాది నేతకు పార్టీ పగ్గాలు అప్పగించాలనే ప్రతిపాదన కూడా బీజేపీ, సంఘ్ పరివార్ వర్గాల్లో వినవస్తోంది. ముఖ్యంగా విపక్ష ఇండియా కూటమి, కులగణన అంశంతో పాటుగా ఉత్తరాది, దక్షిణాది ప్రాంతీయ వాదాన్ని బలంగా తెరపైకి తెస్తున్న నేపధ్యంలో, దక్షిణాది రాష్ట్రాల నేతకు పార్టీ పగ్గాలు అప్పగించాలని పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి బీజేపీ అధ్యక్ష పదవి దక్షిణాది రాష్ట్రాలకు దక్కి, రెండు దశాబ్దాలకు పైగానే అయింది. 2000 నుంచి 2004 లోక్ సభ ఎన్నికల వరకు బంగారు లక్ష్మణ్ ( తెలంగాణ), జానా కృష్ణ మూర్తి ( తమిళనాడు) ఎం. వెంకయ్య నాయుడు ( ఆంధ్ర ప్రదేశ్) , ఒకరి వెంట ఒకరు పార్టీ అధ్యక్షులుగా కొనసాగారు.అంతే అంతకు ముందు ఆ తర్వాత కూడా దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎవరికీ బీజేపీ అధ్యక్ష పదవి దక్కలేదు. అదలా ఉంచితే ఇటీవల కాలంలో కమల దళం కన్ను దక్షిణాది రాష్ట్రాలపై పడింది. ముఖ్యంగా మోదీ, షా జోడీ వ్యూహాత్మక పొత్తులు,ఎత్తులతో దక్షణాది రాష్ట్రాలలో పట్టు పెంచుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. అయితే ఇంత వరకు ఒక్క కర్ణాటక మినహా మిగిలిన దక్షణాది రాష్ట్రాలలో బీజేపీ, బలమైన ప్రత్యాన్మాయ స్థాయికి పార్టీ ఎదగ లేదు. అంతే కాదు, సమీప భవిష్యత్ లో దక్షిణాదిన బీజేపీ పట్టు సాధించడం అయ్యే పని కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే దక్షిణాది రాష్ట్రాలకు పార్టీ పగ్గాలు అప్పగించిన సమయంలో పార్టీ ప్రస్థానం కుంటుపడిందనే అభిప్రాయం పార్టీ నేతల్లో లేకపోలేదు. సో .. మళ్ళీ మరోమారు దక్షణాది రాష్ట్రాల నేతల చేతికి పగ్గాలు అప్పగించే విషయంలో ఒకటికి పది సార్లు ఆలోచించ వలసి ఉంటుందని, అంటున్నారు.ఏది ఏమైనా, బీజేపీ జాతీయ అధ్యక్షుని ఎంపికకు సంబంధించి ఇంతవరకు ఎంత కసరత్తు జరిగినా అంతమ నిర్ణయం మాత్రం ఇంత వరకు జరగలేదు. ఈ నెల 21నుంచి బెంగుళూరులో మూడు రోజుల పాటు జరిగే, ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రతినిధి సమావేశం తర్వాతనే అంతిమ నిర్ణయం ఉంటుందని తెలుస్తోంది. అదొకటి అలా ఉంటే, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి విషయంలోనూ సదిగ్దత కొనసాగుతోంది. జాతీయ అధ్యక్షుడి ఎంపిక విషయంలోలానే, రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక విషయంలోనూ అనేక పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఒక దశలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు పేరు ఇంచుమించుగా ఖరారు అయినట్లేనని వినిపించినా, ఆ తర్వాత ఎంపీలు ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన రావు, పేర్లు తెరపైకి వచ్చాయి. అలాగే తాజాగా డీకే అరుణ, మురళీ ధర రావు పేర్లు వినిపిస్తున్నాయి.అయితే, పార్టీ నాయకత్వం దృష్టిలో అధ్యక్ష పదవి రేసులో ఎవరు ఉన్నారు, ఎవరు లేరు, అనే విషయంలో ఇంతవరకు పార్టీ రాష్ట్ర నేతలు ఎవరికీ స్పష్టత లేదని అందుకే, ఎవరికి వారు సైలెంట్ గా ఉన్నారని అంటున్నారు.అదొకటి అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ఎంపిక తీరును గమనిస్తే, పార్టీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షుల ఎంపిక కూడా అదే విధంగా అనూహ్యంగా ఉన్నా ఆశ్చర్య పోనవసరం లేదని అంటున్నారు.అవును, అంతిమంగా ఎక్కడా కనిపించి, వినిపించని అదృశ్య నేత అధ్యక్ష పీఠం ఎక్కినా ఆశ్చర్య పోనవసరం లేదని, పార్టీ అతర్గత వర్గాల విశ్వసనీయ సమాచారం.

# ఈ సారి అయినా అద్దంకికి దక్కేనా ?

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల క్రతువు ఇంకా పూర్తి కాలేదు. రెండు ఉపాధ్యాయ,ఒక పట్టభద్రుల నియోజక వర్గాలకు జరిగిన ఎన్నికల్లో ఒక స్థానాన్ని(కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్,మెదక్) బీజేపీ కైవసం చేసుకుంది. కమలం పార్టీ బలపరిచిన మల్క కొమురయ్య విజయకేతనం ఎగరేసారు. రెండో స్థానం (నల్గొండ, వరంగల్, ఖమ్మం,) స్థానాన్ని పీఆర్టీయు అభ్యర్ధి శ్రీపాల్ రెడ్డి గెలుచు కున్నారు. పట్టభద్రుల స్థానం ఫలితం ఇంకా తేలలేదు. కానీ, ఇంతలోనే కేంద్ర ఎన్నికల సంఘం, మరో ఐదు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసింది. మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రి సత్యవతి రాథోడ్ ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్‌ల పదవీ కాలం మార్చి 29తో ముగుస్తుంది. ఈ ఐదు స్థానాలు భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం మర్చి 3 నోటిఫికేషన్ జారీ చేసింది. మార్చి 20న పోలింగ్ జరుగుతుంది. ఎమ్మెల్యేల సంఖ్యాబలం ప్రకారం అయితే, నాలుగు స్థానాలు కాంగ్రెస్, ఒక స్థానంలో బీఆర్ఎస్' (ఏకగ్రీవంగా) గెలిచే అవకాశం వుంది. అయితే, చివరకు ఏమిజరుగుతుతుంది అనేది, ఎవరి వ్యూహం ఏమిటో తెలిసే వరకు చెప్పలేము. అలాగే అభ్యర్ధులు ఎవరన్న విషయంలోనూ, ఉహాగానాలే కానీ, క్లారిటీ లేదు. ముఖ్యంగా, కాంగ్రెస్ పార్టీలో ఆశావహులకు కొదవలేదు. ఇంచుమించుగా డజను మందికి పైగానే పోటీ పడుతున్నారు. అయితే, మిగిలిన వారి విషయం ఎలా ఉన్నా, ప్రతిసారీ 'సారీ' తోనే సరిపెట్టుకుంటున్న అద్దంకి దయాకర్ కు ఈసారయినా అవకాశం దక్కుతుందా? చట్ట సభలో కాలు పెట్టాలనే ఆయన చిరకాల కోరిక నెరవేరుతుందా? అన్న భేతాళ ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సమాధానం చిక్కని ప్రశ్నగా చక్కర్లు కొడుతోంది. నిజానికి, తెలంగాణ రాజకీయాల్లో పరచయం అవసరం లేని కొద్దిమంది నాయకుల్లో,అద్దంకి దయాకర్ ఒకరు. ఏ టీవీ ఆన్ చేసినా, ఏ యూట్యూబ్ చూసినా, హాయ్ ..అంటూ పలకరించే పోలిటిషియన్ అద్దంకి దయాకర్. రాష్ట్రంలో ఏ మూలాన ఉన్నా, కొండకచో ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో ఉన్నా, మీడియాకు అందుబాటులో ఉండే కొద్ది మంది సీనియర్ రాజకీయ నాయకుల్లో దయాకర్ ఒకరు. అలాగే, విషయం ఏదైనా, విషయ పరిజ్ఞానంతో స్పందించగలిగిన కాంగ్రెస్ నాయకుల్లో అద్దంకి దయాకర్ ముందు వరసలో ఉంటారు. అలాగే, అద్దంకి దయాకర్ ను కండువా అవసరం లేని కాంగ్రెస్ నాయకుడుగా పేర్కొంటారు. ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటు గాంధీలతో మంచి సాన్నిహిత్యం ఉన్న నేతల్లోనూ దయాకర్ ముందు వరసలోనే ఉంటారు. మాలమహానాడు, తెలంగాణ జెఏసీ ఉద్యమాల ద్వారా రాజకీయ అరంగేట్రం చేసిన దయాకర్, కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీ కొమ్ము కాసిన కొద్ది మంది ఉద్యమ నాయకుల్లో ఒకరు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవి చేపట్టే క్రమంలో, ఆ తర్వాత అద్దంకి దయాకర్ మీడియాలో ఓ వెలుగు వెలిగారు. రేవంత్ రెడ్డి కోటరీలో కీలక నేతగా నిలిచారు. ఒకటి రెండు సందర్భాలలో, రేవంత్ రెడ్డి కోసం, 'ఉంటే ఉ ండు లేదంటే ...' వంటి వివాదస్పద వాఖ్యలు చేసి, సమస్యల్లో చిక్కుకున్నా రేవంత్ రెడ్డి చేయి వదలలేదు. రేవంత్ రెడ్డికి మాటల కవచంగా నిలిచారు. నీడల ఆయన వెంట నడిచారు. అంతే కాదు, కాంగ్రెస్ ఫస్ట్ ఫ్యామిలీ, గాంధీ



కుటుంబంతో ముఖ్యంగా రాహుల్ గాంధీతో సన్నిహిత సంబందాలున్నాయి. అలాగే, ఒకటి రెండు సందర్భాలలో దయాకర్ వలన తనకు సమస్యలు వచ్చినా రేవంత్ రెడ్డి కూడా ఆయన చేయి వదల లేదు.అయితే, అదేమిటో కానీ, అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు, చట్టసభలో కలుపెట్టాలనే ఆయన కోరిక మాత్రం, ఇంత వరకు తీరలేదు. ఒకటికి, రెండుసార్లు నల్గొండ జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి 2014, 2018, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. మూడవసారి, 2024లో పార్టీ టికెట్ నోటిదాకా వచ్చి, చే ... జారిపోయింది. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం దృష్ట్యా, వడ్డించే వాడు మన వాడు అయినప్పుడు, ఏ పంక్తిలో కూర్చుంటే ఏమిటి అన్నట్లు, ఎమ్మెల్యే కాకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు తగిన పదవి ఇస్తారని అందరూ అనుకున్నారు. నిజానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అయితే, దయాకర్ ఒకటి నేను ఒకటీనా, (ఇద్దరం ఒకటే అని భావం) ఆయనకు మంచి పదవి ఇస్తానని బహిరంగంగానే ప్రకటించారు. అయితే అదేమిటో కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 14 నెలలు పూర్తయినా, ఇంతవరకు దయాకర్ కు ఏ పదవీ దక్క లేదు. అంతే కాదు, వినాయకుడి పెళ్ళికి అన్నీ విఘ్నాలే అన్నట్లు, ఎమ్మెల్సీ, రాజ్యసభ టికెట్ సహా' అనేక అవకాశాలు అందినట్లే అంది చేజారి పోయాయి. ఈ నేపధ్యంలోనే, ఈ సారి అయినా అద్దంకి దయాకర్ ఆశ నెరవేరుతుందా? చట్ట సభలో కాలు పెట్టాలన్న ఆయన చిరకాల కోరిక నెరవేరుతుందా? అనేది, ఆసక్తికరంగా మారింది. అయితే, ఎప్పటిలానే ఇప్పుడు కూడా, అద్దంకికి ఈ సారి టికెట్ పక్కా అనే ప్రచారం అయితే చాలా జోరుగా జరుగుతోంది. ఈ సారి కాకుంటే ఇక ఎప్పటికీ 'సారీ'నే అనే మాట కూడా కాంగెస్ వర్గాల్లో వినవస్తోంది. మరో వంక దయాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే కాకుండా, నల్గొండ జిల్లా కాంగ్రెస్ నాయకులు, జానా రెడ్డి, కోమటి రెడ్డి ఇతర నాయకులను వ్యక్తిగతంగా కలిసి .. ప్లీజ్ .. ఈ ఒక్క సారికీ అడ్డురావద్దని అడిగినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే , అంతిమంగా ఏమి జరుగుతుంది అనేది మాత్రం ప్రస్తుతానికి, ఇంకా భేతాళ ప్రశ్నగానే వుంది. ఊహకు అందడం లేదు. అందుకే, ఆయన సన్నిహితులు సైతం టికెట్ వచ్చి నామినేషన్ వేసే వరకు సస్పెన్సు కొనసాగుతుందని,భేతాళ ప్రశ్నకు సమాధానం చిక్కదని అంటున్నారు.

# గ్రాడ్యుయేట్స్ ఫెయిల్యూర్! విద్యావంతుల ఓట్లన్నీ ఫసక్

కరీంనగర్,పెద్దల సభకు సభ్యులను ఎన్నుకోవడానికి రాజ్యాంగం విద్యావంతు లకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక అవకాశం ఇచ్చింది. అందులో భాగంగా ఉ పాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలను ఏర్పాటు చేసి ఆయా నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్సీలను ఎన్నుకుంటారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి డిగ్రీ పూర్తయిన వారు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగి ంచుకుంటారు. అయితే.. ఈమధ్య కాలంలో ఈ రెండు నియోజకవర్గాల నుంచి చెల్లని ఓట్లు అధికంగా కనిపించడంతో పలువురు ఆశ్చర్యపోతున్నారు. వీళ్లు విద్యావంతులా? అని ముక్కు మీద వేళ్లు వేసుకుంటు న్నారు. నిజంగా డిగ్రీ పాస్ అయ్యారా? అనే సందేహాలు చాలా మంది నుంచి వినిపిస్తున్నాయి. అలాగే.. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ టీచర్ ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో 879 చెల్లని ఓట్లున్నాయి. నల్లగొండ-వరంగల్-మెదక్ టీచర్ ఎమ్మెల్సీ కౌంటింగ్‌లోనూ 492 ఓట్లు ఫెయిల్ అయ్యాయి. కొంతమంది ఉపాధ్యాయులు కూడా అవగాహన లోపంతో ఓటేసినట్టు తెలుస్తోంది.

సాధారణ ఓటింగ్ కంటే డిఫారెంట్..

శాసనసభ ఎన్నికల్లో ఈవీఎం వినియోగిస్తుంటారు. కాబట్టి పెద్ద సమస్య లేదు. మండలి ఎన్నికల్లో ఓటింగ్ వేయడం డిఫారెంట్. కౌంటింగ్ కేంద్రంలో ఉన్న పెన్ను తీసుకుని అభ్యర్థికి ఎదురుగా ఉన్న బాక్సులో 1, 2, 3 అంకెలు వేయాలి. ఒకవేళ రోమన్ అంకెలు వేసినా.. బ్యాలెట్‌పై ఏమైనా రాసినా ఆ ఓటు చెల్లదు. ఈ ఓటింగ్ ఎలా వేయాలనేదానిపై అభ్యర్థులు ఒకవైపు, అధికారులు మరోవైపు ప్రచారం చేస్తునే ఉన్నారు.

పెద్ద మొత్తంలో చెల్లని ఓట్లు..

ఈ సారి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్ద మొత్తంలో చెల్లని ఓట్లు నమోదయ్యాయి. దీంతో గెలుపు బాట పట్టాల్సిన అభ్యర్దుల లెక్కలు తారుమారుకావడంతో తలలు పట్టుకుంటున్నారు. దేశంలో ఎన్నికలను ఓ పండుగలా చూస్తారు. భవిష్యత్తు నిర్మాణానికి మంచి నాయకులను ఎన్నుకోవడం కీలకమని నమ్ముతారు. అందుకే ఊరూ వాడా అందరూ దండుగా కదిలొచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటారు. అక్షర జ్ఞానం లేని నిరక్షరాస్యులు కూడా ఓటు ఎలా వేయాలో తెలుసుకొని మరీ తమ హక్కు కాపాడుకుంటారు. తమకు నచ్చిన అభ్యర్థులకు ఓట్లు వేస్తుంటారు. అయితే.. నిరక్షరాస్యులు ఇంత సులువుగా చేసిన పని గ్రాడ్యుయేట్లు




చేయలేకపోతున్నారని చాలామంది కామెంట్స్ చేస్తున్నారు. సరిగ్గా ఓటు వేయకుండా గందరగోళం నెలకొనేలా చేస్తున్నారు. కొందరు బ్యాలెట్ పేపర్ల మీద రైట్ గుర్తుపెట్టగా.. ఇంకొందరు బ్యాలెట్ పేపర్ తిరగేసి అంకెలు వేశారు. చెల్లని ఓట్ల ఇష్యూతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కౌంటింగ్ లేట్ అవుతోందని సమాచారం. ఫలితాల్లో ఒక్కో ఓటు కీలకమైన నేపథ్యంలో ఏకంగా వేలకు వేలు ఓట్లు చెల్లనివిగా తేలడంతో అభ్యర్థులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. చదువుకున్న వారు ఓటు సరిగ్గా వేయకపోవడం ఏంటి అసలు వీళ్లను ఏమనాలి అంటూ ఈ విషయంపై సోషల్ మీడియాలో నెటిజన్స్ సీరియస్ అవుతున్నారు.

తెలంగాణలో..

తెలంగాణలో కరీంనగర్-మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 3,55,159 ఓట్లకు గాను 2,50,106 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 1,62,561 మంది పురుషులు కాగా, 87544మంది మహిళా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల స్థానానికి 56 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. ఓట్ల లెక్కింపులో ఇప్పటి వరకు సుమారు 27,671 చెల్లని ఓట్లను అధికారులు గుర్తించారు.

ఆంధ్రప్రదేశ్‌లో..

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కృష్ణా గ్రాడ్యుయేట్ స్థానంలోనూ మొత్తం 2,41,774 ఓట్లు పోలయ్యాయి. వాటిలో మొత్తం 26,909 ఓట్లు చెల్లలేదు. ఉభయ గోదావరి జిల్లాల స్థానంలో మొత్తం 2,18,902 ఓట్లు పోలవ్వగా వాటిలో 31, 202 ఓట్లు చెల్లుబాటు కాలేదు.

# భారత్‌లో టెస్లా పరుగులు ఖాయం




ముంబై, ముంబైలో తన మొదటి షోరూమ్ కోసం ఒప్పందాన్ని ఖరారు చేయడంతో టెస్లా భారతదేశంలో ప్రారంభించటానికి దగ్గరగా ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్న ఈ సమయంలో కంపెనీకి ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఇటీవలి మీడియా నివేదికల ప్రకారం, టెస్లా ముంబైలోని ప్రధాన బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ లో 4,000 చదరపు అడుగుల వాణిజ్య సముదాయాన్ని బుక్ చేసుకుంది. ఈ ఫ్లాగ్‌షిప్ షోరూమ్ టెస్లా తాజా ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రదర్శిస్తుంది. టెస్లా నెలవారీ అద్దెను దాదాపు రూ.35 లక్షలు అంటే చదరపు అడుగుకు రూ.900 గా నిర్ణయించింది. లీజు ఒప్పందం ఐదు సంవత్సరాలు. టెస్లా ఇప్పటికే ఢిల్లీలోని ఏరోసిటీ కాంప్లెక్స్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టెస్లా భారతదేశంలో తన ఉనికిని విస్తరించాలని యోచిస్తోంది. అలాగే దీని కోసం కంపెనీ ఢిల్లీ, ముంబై, పూణెళి వంటి నగరాల్లో అనేక ప్రాంతాలను ఎంచుకోగా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ కంపెనీ తన మొదటి షోరూమ్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఒకటి. దీనితో పాటు టెస్లా ఢిల్లీలోని ఏరోసిటీలో తన షోరూమ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తోంది. భారతదేశంలోకి టెస్లా ప్రవేశం ఎలక్ట్రిక్ వాహన (ఇ÷ఎ) మార్కెట్‌లో పోటీని పెంచడమే కాకుండా భారతదేశ ఆటోమొబైల్ రంగానికి ఒక కొత్త విప్లవంగా కూడా నిరూపించుకోనుంది.టెస్లా మోడల్స్ భారతదేశంలో ప్రీమియం ఆఫర్‌లుగా ఉండనున్నాయి. ధరలు దాదాపు రూ. 21 లక్షల నుండి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# మొదటి వారమే ఖాళీ.. కలెక్షన్స్ మాత్రం 100 కోట్లు



హైదరాబాద్,రాను రాను టాలీవుడ్ సినిమా నిర్మాణం మరింత భారం అయ్యేలా ఉంది పరిస్థితి చూస్తుంటే. ఒక వైపు సినిమాలు డిజాస్టర్లు అవుతున్న కూడా హీరోలు మాత్రం కోట్లకి కోట్లు రెమ్యునరేషన్స్ తీసుకుంటూ నిర్మాతలకు మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు.ఇక నిర్మాణం సంగతి సరే సరి. మొదటి సినిమాతో ఓ మాదిరి హిట్ కొట్టున దర్శకుడు రెండవ సినిమాకు అడిగిన బడ్జెట్ చూసి నోరెళ్లబెట్టాడు ఓ నిర్మాత. సరే అన్నిటికి ఓకే అని నిర్మాత ముందు వచ్చి సినిమా చేసాక.. చివరికు ఆయనకు మిగిలేది ఏందయ్యా అంటే అప్పు తెచ్చిన డబ్బులుకి వడ్డీలు కట్టడానికి మరోసారి అప్పు చేయడమే.ఇటీవల టాలీవుడ్ లో మరో సంస్కృతి మొదలైంది. అదే పోస్టర్ పిచ్చి.. సినిమా డిజాస్టర్ అయిన సరే మొదటి రోజు మాత్రం బిగ్గెస్ట్ ఓపెనింగ్ అని పోస్టర్ పడాలి.. లేదంటే ఫ్యాన్స్ నుండి వచ్చే ట్రోలింగ్ అంతా ఇంతా కాదు. గతేదాడి రిలీజ్ అయిన ఓ భారీ సినిమా వందల కోట్ల పోస్టర్స్ వదిలారు. కానీ ఆంధ్రలోని కొన్ని ఏరియాలలో బ్రేక్ ఈవెన్ కానీ పరిస్థితి. ఇక సంక్రాంతి కానుకగా వచ్చిన పాన్ ఇండియా సినిమా పరిస్థితి ఘోరం. మొదటి రోజు బెనిఫిట్ షో కూడా ఫుల్ కానీ పరిస్థితి అయినా సరే మొదటి రోజు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ పోస్టర్ రిలీజ్ చేసి నవ్వులపాలు అయ్యారు. ఇక మరోక మిడ్ రేంజ్ హీరో సినిమా పరిస్థితి కూడా అటు ఇటుగా ఇదే. కానీ బయకు చెప్పుకోలేని సిచ్యుయేషన్. కానీ హీరోల మెప్పుకోసం వందల కోట్ల రూపాయల పోస్టర్ లు రోజుకొకటి వస్తాయి. వరుసగా హ్యాట్రిక్ ఫ్లాప్స్ కొట్టిన ఓ హీరో ఇప్పటికి తన రెమ్యునరేషన్ ను ముప్పై కోట్లకు పైగానే తీసుకుంటున్నాడు. ఇక సీనియర్ హీరో సంగతి అయితే చెప్పక్కర్లేదు. వందకోట్లకు కాస్త దగ్గరగా లేనిది ఆయన సినిమా చేయరు. ఇంతాఇచ్చి సదరు హీరోలు భారీ కలెక్షన్స్ రాబడతారా అంటే మ్నెదటివారమే థియేటర్స్ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కానీ పోస్టర్స్ మాత్రం వంద కోట్లు దాటేస్తున్నాయి. దీంతో నిర్మాతలకు వచ్చే దానికంటే పోయే లెక్క ఎక్కవగా ఉంది.

# ఈ నెలలోనే మోడీ ఏపీ పర్యటన.. ఎందుకో తెలుసా?

న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్రమోడీ ఈ నెలలో ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రానున్నారు. కేంద్రంలో వరుసగా మూడో సారి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నుంచీ ప్రధాని ఆంధ్రప్రదేశ్ పై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్రంలో కూటమి ప్రభుత్వానికి తెలుగుదేశం అండ అవసరం కావడంతో ఆయన ఆంధ్రప్రదేశ్ పట్ల ఒకింత ప్రత్యేక ప్రేమ కనబరుస్తున్నారు. ఇప్పటికే ఒక సారి విశాఖపట్నంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మోడీ మరోసారి ఈ నెల రెండో వారంలో అంటే మార్చి 2 వారంలో మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. పర్యటనలే కాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినతులకు సానుకూ లంగా స్పందిస్తున్నారు. ఇప్పటికే మోడీ పర్యటన గురించి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాని కార్యాలయం నుంచి సమాచారం వచ్చింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ కృష్ణా జిల్లా నాగాయలంక మండలం గుల్లలమోడలో నిర్మించనున్న క్షిపణి ప్రయోగ కేంద్రానికి శంకుస్థాపన చేస్తారు. ఈ క్షిపణి ప్రయోగ కేంద్రం ఏర్పాటు కోసం వచ్చే ఐదేళ్లలో కేంద్రం 15 వేల నుంచి 20 వేల కోట్ల రూపాయలు వ్యయం చేయనున్నది. పైగా క్షిపణి ప్రయోగ కేంద్రం రక్షణ మంత్రిత్వశాఖకు అత్యంత కీలకమైనది. దీంతో ప్రధాని మోడీ క్షిపణి పరిశోధనా కేంద్రం ఏర్పాటునకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. క్షిపణి ప్రయోగ కేంద్రం కేంద్రం ఏర్పాటుకు గుల్లలమోడ ప్రాంతాన్ని ఎంపిక చేయడమన్నది 2011లోనే జరిగింది. ఇందుకు సంబంధించిన భూసేకరణ తెలుగుదేశం హయాంలో అంటే 2017లో పూర్తయ్యింది. . అయితే ఆ తరువాత పనుల పురోగతిలో తీవ్ర జాప్యం జరిగింది. ఇప్పుడు మళ్లీ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కొలువు దీరగానే పనులు ముందుకు సాగుతున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరిపింది. క్షిపణి పరీక్షా కేంద్రానికి తానే స్వయంగా శంకుస్థాపన చేస్తానని మోడీ అన్నారు. దీంతో ఇందు కోసం ఆయన ఈ నెల రెండో వారంలో రాష్ట్రపర్యటనకు రానున్నా రు. మోడీ పర్యటన తేదీ



అయితే ఇంకా ఖరారు కాలేదు కానీ రెండో వారంలో ఆయన పర్యటన ఉం టుందని ప్రధాని కార్యాలయం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది.

## కొనసాగుతున్న యాగగిరీశుడి బ్రహ్మోత్సవాలు

యాద్రాద్రిభువనగిరి,వటపత్రశాయిగా, రాత్రి హంస వాహన సేవలో లక్ష్మీ నరసింహ స్వామి మహాద్భుత దర్శనభాగ్యం భక్తులకు కలిగింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్స వాలు నాలుగు రోజులుగా ఏకకుండాత్మక, నావాహ్నిక, పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో జరుగుతున్నాయి. ప్రధా నాలయంలో మంగళవారం వేకువజామున ద్వారతోరణ పూజ, ధ్వజ కుంభారాధన, అగ్ని ఆరాధన, మూల మంత్ర, పంచసూక్త హవనం తదితర పూజలను ఆలయ ప్రధానార్చకులు, యాజ్ఞికులు, రుత్వికులు, పారాయణం దారులు నిర్వహించారు. అనంతరం ఉదయం 8.00 గంటలకు స్వామివారిని వంటపత్ర శాయి అలంకారంలో ప్రత్యేక పల్లకిపై అధిష్టించారు. రుత్వికులు, వేదపండితులు స్వామివారి అలంకార సేవ ముందు దివ్య ప్రబంధ వేద పారాయణాలు, మూల మంత్ర జప పఠనాలు గావించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com